Follow: @ANNTELUGU

ANN తెలుగు

22-10-2025

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 316 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్నదమ్ములు

**జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి రెండూ చేసిందేమీ లేదు**

బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ఫైర్

బీజేపీ జూబ్లీహిల్స్ అభ్యర్థిగా దీపక్ రెడ్డి నామినేషన్ దాఖలు




**హైదరాబాద్, మహా:** బీజేపీ జూబ్లీహిల్స్ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నారు బీజేపీ అభ్యర్థి. మరి కాసేపట్లో వెంకటగిరి కాలనీ నుంచి ర్యాలీ మొదలుకానుంది. ఈ ర్యాలీలో బీజేపీ అగ్ర నాయకులు పాల్గొననున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపఎన్నికలో భారతీయ జనతా పార్టీ విజయం ఖాయమని ఆ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అంటూ వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్... జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ రోడ్లను చూస్తేనే తెలుస్తోంది వారు చేసిన అభివృద్ధి ఏంటనేది అని అన్నారు. ఎక్కడ చూసినా రోడ్లపై మురుగు నీరు పారుతోందని తెలిపారు. అభివృద్ధి కోసం బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ప్రజల కోసం పోరాటం చేసే పార్టీ బీజేపీ అని స్పష్టం చేశారు. గెలిపిస్తే పోరాటం చేసైనా జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అన్నదమ్ముల లాంటి వారన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒకటే అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని లంకల దీపక్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**టాప్ న్యూస్**

### ఆర్ఎస్ఎస్‌ను అడ్డుకోవడం ఎవరి తరం కాదు



- బీజేపీ అధికారంలోకి రాగానే భాగ్యలక్ష్మి టెంపుల్ ను గోల్డెన్ టెంపుల్ గా మారుస్తాం
- కర్నాటకలో సస్పెండైన అధికారికి ప్రమోషన్ ఇస్తాం
- ఆర్ఎస్ ఎస్ గొప్పతనాన్ని ఇందిరాగాంధీ చాటి చెప్పిన విషయాన్ని కాంగ్రెసోళ్లు మర్చినట్లున్నారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్

02

### హరీష్ రావు.. ప్రమాణం చేయగలవా?



- ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా?
- కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా
- బీఆర్ఎస్ నేతకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మరోసారి కౌంటర్

02

### ఆపరేషన్ హిడ్మా



- 200 మందితో లొంగిపోతారని ప్రచారం
- హిడ్మా అడుగులపై సర్వత్రా ఉత్కంఠ

02




# శాంతి భద్రతల విషయంలో తెలంగాణ ఫస్ట్

## పోలీసులంటే సమాజానికి ఒక నమ్మకం, భరోసా

- ప్రాణాలను సైతం ఫణంగా పెట్టాల్సి వచ్చినా వెనుకడుగు వేయరు
- అమరుడైన పోలీస్ కుటుంబానికి రూ.1 కోటి, భూమి
- దాదాపు 16 వేల మంది కానిస్టేబుల్స్, ఎస్ఐలను రిక్రూట్ చేశాం
- మిగతా మావోయిస్టులు జన జీవన ప్రవంతిలో కలవాలి
- పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:**

వామపక్ష తీవ్రవాద భావజాల ఉద్యమాల్లో ఉన్న అజ్ఞాత నాయకులు జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే చట్టాన్ని గౌరవించే పౌరుల కోసమే తప్ప, చట్టాన్ని ఉల్లంఘించే వారికి కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజల భద్రత, శాంతిని పరిరక్షిస్తూ తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆకాంక్షించారు. "పోలీసు అమరవీరుల సంస్మరణ దినం" సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖ గోషామహల్‌లో నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్‌లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాల సభ్యులను పరామర్శించారు. శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశానికి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు, పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు. ఇటీవలి కాలంలో కొందరు కీలక మావోయిస్టు నాయకులు లొంగిపోయిన అంశాన్ని ప్రస్తావిస్తూ మిగిలిన మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు.

మిగతా 2లో

## స్టార్‌ధిస్టారులు

**బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా నిర్మలా సీతారామన్**

**ఇటు రేవంత్.. అటు కేసీఆర్.. హోరెత్తనున్న ప్రచారం**



**హైదరాబాద్, - మహా:** కేసీఆర్ రావడం ఖాయమైంది. స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో కేసీఆర్ పేరును మొదటగా పేర్కొన్న బీఆర్ఎస్ పార్టీ నవంబర్ మొదటివారంలో కేసీఆర్ ప్రచారానికి ప్లాన్ చేస్తోంది. బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో నిర్మలా సీతారామన్ ను పేర్కొన్న బీజేపీ మహిళా సెంటిమెంట్ కోసం కేంద్రమంత్రి ప్రచారాన్ని వినియోగించుకోనుంది. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రచారానికి ఫైర్ బ్రాండ్ సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇటు సీఎం రేవంత్ రెడ్డి, అటు మాజీ సీఎం కేసీఆర్ ల ప్రచారాలపై సర్వత్రా ఆసక్తి ఉంది. ఎన్నికల సమయంలో రేవంత్ ప్రచారంలో పేల్చే పంచ్ లు.. డైలాగ్ లు ఓ రేంజ్ లో ఉంటాయి. ప్రత్యర్థులపై ఆయన విరుచుకుపడేతీరు పౌరుషాగ్ని రగిలించేలా, క్యాడర్ ను ఉత్సాహ ఉద్రేకపరిచేలా సమ్మోహనంగా ఉంఉంది. రేవంత్ ప్రసంగాలకు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంది. ఇక కేసీఆర్ ప్రసంగాల్లో మునుపటి పదును తప్పినా.. ఆయన ప్రసంగాల కోసం ప్రజలు, క్యాడర్ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు.

## హెచ్ఎండీఏ నయా రికార్డు

**రికార్డు స్థాయిలో రూ.1225 కోట్ల ఆదాయం**

- గతంతో పోలిస్తే 137 శాతం పెరిగిన అనుమతులు
- హెచ్ఎండీఏ అద్భుతమైన సేవలు, అనూహ్యమైన ప్రగతి
- పెట్టుబడిదారులకు విశ్వసనీయమైన వాతావరణాన్ని ఏర్పరుస్తుంది
- మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ కీలక విషయాలు వెల్లడి

hmda Growing Global

వివరాలు 2లో

**జూబ్లీహిల్స్ @180**

- ఉప ఎన్నికకు భారీగా నామినేషన్లు
- ముగిసిన నామినేషన్ల గడువు
- నేటి నుంచి పరిశీలన.. 24 వరకు విత్ డ్రాకు గడువు

02

**కేంద్రంపై మండిపడ్డ మావోయిస్టులు**

- కార్పొరేట్ ల కోసమే కగార్ యుద్ధం అని మండిపాటు
- 24న దేశవ్యాప్త బంద్ కు పిలుపు

02

02

## దానం నాగేందర్ మా ఎమ్మెల్యే

**కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు**









# శాంతి భద్రతల విషయంలో
# తెలంగాణ ఫస్ట్




(మొదటిపేజీ తరువాయి)

"పోలీస్ అంటే సమాజానికి ఒక నమ్మకం, భరోసా. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టాల్సి వచ్చినా వెనుకడుగు వేయరు. నెత్తురు చిందుతున్నా మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం. పోలీసు ఉద్యోగం కత్తి మీద సాము వంటిదే. పోలీసులకు ప్రతి క్షణం పరీక్షే, ప్రతి దినం పోరాటమే. ఒకవైపు నేరాల అదుపు, మరోవైపు నేరాల విచారణ, ట్రాఫిక్ నియంత్రణ, పగటి గస్తీ, రాత్రి గస్తీ, బందోబస్తు, వీఐపీల రక్షణ.. ఇలా సవాలక్ష బాధ్యతలతో విరామం లేకుండా పని చేస్తూ మనమందరం ప్రశాంతంగా జీవించేందుకు తమ జీవితాలను త్యాగం చేస్తున్నారు. మన ప్రాణానికి వారి ప్రాణాలను అడ్డుపెట్టే పోలీసుల రుణం ఏమిచ్చినా తీరదు. సమాజ శ్రేయస్సే ఊపిరిగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మా ప్రభుత్వం పోలీసుల సంక్షేమం కోసం అనేక చర్యలను చేపట్టింది. అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 16 వేల మంది కానిస్టేబుల్స్, ఎస్ఐలను రిక్రూట్ చేశాం. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందించాం. విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో ఉచిత విద్య, వైద్యం, బస్ పాస్ సౌకర్యం తదితర పథకాలను అందజేస్తున్నాం.

**అధికారులకు రూ. 2 కోట్లకు పెంచుతూ..**

మెడికల్ సీట్లలోను పోలీస్ అమరుల పిల్లలకు ప్రత్యేకంగా సీట్లను కేటాయిస్తున్నాం. తీవ్రవాదుల, ఉగ్రవాదుల హింసలో చనిపోయిన వారికి అందించే ఎక్స్‌గ్రేషియాను కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు కోటి రూపాయలను, ఎస్సై సీఐలకు కోటి 25 లక్షల రూపాయలను, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు కోటి 50 లక్షల రూపాయలను, ఎస్పీలకు ఇతర ఐపీఎస్ అధికారులకు 2 కోట్ల రూపాయలకు పెంచుతూ మా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా 191 మంది పోలీసు సిబ్బంది, తెలంగాణలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారు. 3 రోజుల కింద నిజామాబాద్ లో సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారు. భర్త ప్రమోద్‌ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. 1 కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా, అమరుడైన కానిస్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ వేతనంతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నాం.

**ప్రమోద్ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా..**

వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి 16 లక్షల ఎక్స్ గ్రేషియా, పోలీస్ సంక్షేమం నుంచి 8 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటాం. ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 ప్రకారం దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం లభించింది. అలాగే, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విధానంలోనూ విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేక అభినందనలు పొందింది. ఈ విజయాలు తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనం. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారథ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే. ఆ బాధ్యతతోనే పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రత్యేక విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాం. అందులో భాగంగా పోలీసుల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించాం. పోలీస్ శాఖ ఇదే పనితీరును కొనసాగిస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని కోరుకుంటున్నాను. పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక విలువలు పాటించడం పోలీసింగ్ కు మూల స్థంభాలు. ఇవే సమాజాన్ని పోలీసులకు దగ్గరికి చేయడంతోపాటు పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంపొందిస్తాయి. సమాజానికి దగ్గరగా ఉండే పోలీసింగ్ మోడల్‌ను అనుసరించాలి.." అని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఆయా విభాగాలకు చెందిన ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పోలీసు సురక్ష రూపొందించిన "అమరులువారు" పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఆర్ఎస్ఎస్‌ను అడ్డుకోవడం
# ఎవరి తరం కాదు

బీజేపీ అధికారంలోకి రాగానే భాగ్యలక్ష్మి టెంపుల్ ను గోల్డెన్ టెంపుల్ గా మారుస్తాం

కర్నాటకలో సస్పెండైన అధికారికి ప్రమోషన్ ఇస్తాం

ఆర్ఎస్ ఎస్ గొప్పతనాన్ని ఇందిరాగాంధీ చాటి చెప్పిన విషయాన్ని కాంగ్రెసోళ్లు మర్చినట్లున్నారు

కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, మహా:** పాతబస్తీలో భాగ్యలక్ష్మి ఆలయం ఎక్కడుంది? అంటూ హేళన చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఈరోజు కళ్లు తెరిచి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారి శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్నాకే ప్రజాసంగ్రామ యాత్ర విజయవంతమైందని, జీహెచ్ఎంసీ, హుజూరాబాద్, దుబ్బాక ఎన్నికల్లో బీజేపీ గెలిచిందన్నారు. పార్లమెంట్ లో 8 స్థానాలు గెలుచుకోవడమే కాకుండా విజయ పరంపరను కొనసాగిస్తున్నామని చెప్పారు. లక్షలాది మంది అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా మారుస్తామని పునరుద్ఘాటించారు. కర్నాటకలో ఆరెస్సెస్ పథ సంచలన్ లో పాల్గొన్నందుకు ఓ ప్రభుత్వ అధికారిని సస్పెండ్ చేయడంపై తీవ్రంగా స్పందించారు. కర్నాటకలో బీజేపీ అధికారంలోకి రాగానే సదరు అధికారికి రెండున్నరేళ్ల కాలానికి జీతభత్యాలు ఇవ్వడంతోపాటు ప్రమోషన్ ఇస్తామని స్పష్టం చేశారు. దీపావళి పర్వదినం ఈరోజు సాయంత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, జె.సంగప్ప, ఉమా మహేందర్ తదితరులతో కలిసి పాతబస్తీ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సంజయ్ కు ఘన స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆయా నేతలతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. దీపావళి పర్వదినం సందర్భంగా పాతబస్తీ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది. హిందూ బంధువులందరికీ దీపావళి శుభాకాంక్షలు. అమ్మవారి శక్తి అందరికీ తెలుసు. అమ్మవారి కరుణాకటాక్షం కోసమే అందరం ఇక్కడికి వస్తున్నం. అమ్మవారివల్లే తెలంగాణలో అందరం సుభిక్షంగా ఉన్నాం. నాకైతే కరీంనగర్ లో మహాశక్తి అమ్మవారు, భాగ్యనగర్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీర్వాదం, కరుణాకటాక్షంతోనే ధర్మం కోసం, దేశం కోసం పనిచేస్తున్నా. భాగ్యలక్ష్మి అమ్మవారిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పే అవకాశం, అదృష్టం నాకు దక్కడం చాలా ఆనందంగా ఉంది. నేను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భాగ్యలక్ష్మి అమ్మవారి పాదాల సాక్షిగా ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించినం. ఎండకు, వానకు, చలిని తట్టుకుని ఎన్ని ఆటంకాలు, అడ్డంకులు వచ్చినా పాదయాత్రను విజయవంతం చేసినం. 1600 కి.మీలు పాదయాత్ర చేసిన. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల్లో పోటీ చేసి హిందూ సంఘటిత శక్తిని చాటినం. అమ్మవారి దయవల్లే 4 నుండి 48 స్థానాలు గెలిచినం. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లోనే అమ్మవారి దర్శనం తరువాతే గెలిచినం. మునుగోడు ఎన్నికల్లో నాటి ప్రభుత్వం అనేక అరాచకాలు గెలిచినా పోరాడి గెలుపు అంచులదాకా వచ్చినం. అమ్మవారి దయతోనే బీజేపీ 8 ఎంపీ స్థానాల్లో గెలిచినం. విజయపరంపరను కొనసాగిస్తున్నాం. గతంలో భాగ్యలక్ష్మి అమ్మవారు లేనే లేదు. బండి సంజయ్ కొత్త కొట్లాట పెడుతున్నారని కాంగ్రెస్, బీఆర్ఎసోళ్లు హేళన చేశారు. ఆనాడు హేళన చేసిన వాళ్లే ఇయాళ అమ్మవారి శక్తి తెలుసుకుని దర్శించుకుంటున్నారు. ఆలస్యంగానైనా అమ్మవారి శక్తిని తెలుసుకున్నందుకు అభినందనలు. అమ్మవారి శక్తి తెలుసుకాబట్టే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా ఎంతో మంది ప్రముఖులు దర్శనం చేసుకున్నారు. అందుకే బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ గా మారుస్తాం. రాబోయే రోజుల్లో రాబోయేది మోదీ రాజ్యమే. కర్నాటకలో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్ లో పాల్గొన్న పాపానికి ఒక ప్రభుత్వ అధికారిని సస్పెండ్ చేయడం దుర్మార్గం. తీవ్రంగా ఖండిస్తున్నా. ఆర్ఎస్ఎస్ రాజకీయ పార్టీ కాదు. సాంస్కృతిక, జాతీయవాద సంస్థ. ఆర్ఎస్ఎస్ లాంటి క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన గొప్ప సంస్థ అని నాటి ప్రధాని ఇందిరాగాంధీ చెప్పారు. అంతెందుకు కర్నాటక డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్న శివకుమార్ సైతం అసెంబ్లీ సాక్షిగా ఆర్ఎస్ఎస్ గీతం పాడి గొప్పతనాన్ని తెలియజేశారు. కాంగ్రెస్ ఉండేది ఇంకా రెండేళ్లే. రెండేళ్ల దాకా సస్పెండైన అధికారి ఆర్ఎస్ఎస్ ద్వారా దేశ సేవ చేయాలని కోరుతున్నా. రెండేళ్ల తరువాత కర్నాటకలో మళ్లీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమే. అధికారంలోకి రాగానే సస్పెండైన అధికారికి రెండున్నరేళ్ల జీతభత్యాలన్నీ ఇవ్వడం తోపాటు ప్రమోషన్ కూడా ఇస్తాం. ఒక్కటి మాత్రం చెబుతున్నా. అరచేతిని అడ్డం పెట్టి సూర్యుడిని ఆపలేమన్నది ఎంత సత్యమో, నిషేధం పేరుతో ఆర్ఎస్ఎస్ ను అడ్డుకోలేరనేది కూడా అంతే సత్యం అని అన్నారు.

# హెచ్ఎండీఏ నయా రికార్డు

రికార్డు స్థాయిలో రూ.1225 కోట్ల ఆదాయం

గతంతో పోలిస్తే 137 శాతం పెరిగిన అనుమతులు..

హెచ్ఎండీఏ అద్భుతమైన సేవలు, అనూహ్యమైన ప్రగతి

పెట్టుబడిదారులకు విశ్వసనీయమైన వాతావరణాన్ని ఏర్పరుస్తుంది..

మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ కీలక విషయాలు వెల్లడి

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ సరికొత్త రికార్డు సృష్టించింది. రికార్డు స్థాయిలో ఆదాయం సమకూర్చింది. నగరం నలుమూలల విస్తృత అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న హెచ్ఎండీఏ అనూహ్యమైన ప్రగతి సాధిస్తూ, వేగవంతమైన పనితీరుతో ముందూ దూసుకుపోతోంది. సీఎం రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఎ) భవనాలు, బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్ల లేఔట్ లు, విల్లా లేఔట్ ల అనుమతులలో గణనీయమైన ఫలితాలు సాధిస్తోంది. గత సంవత్సరాలలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలలలోనే అనుమతుల మంజూరు విషయంలో కానీ, ఆదాయం విషయంలో కానీ అద్భుతమైన పనితీరును ప్రదర్శించి ప్రజల మన్ననలు అందుకుంటోంది. 26 శాతం బిల్డింగ్ అనుమతులు పెరిగాయి. హెచ్ఎండీఏ ప్రస్థానంలో ప్రధానమైన అంశం నిర్దిష్ట కాలపరిమితిలో దరఖాస్తుల పరిష్కారం. ఈ ఏడాది దీనిలో గొప్ప ప్రగతిని సాధించింది. 2025 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు మాత్రమే చూస్తే గణనీయమైన పరిష్కారం సాధించింది. ఇది 2024లోని మొదటి తొమ్మిది నెలలతో పోలిస్తే 49 శాతం, 2023 తో పోలిస్తే 36 శాతం అధికం. భవన అనుమతుల కోసం మొత్తం 2,961 దరఖాస్తులు వచ్చాయి. వీటి సంఖ్య 2024తో పోలిస్తే 18 శాతం, 2023తో పోలిస్తే 8 శాతం పెరిగాయి. వాటిలో 2,904 పరిష్కారం అయ్యాయి. అంటే 98 శాతానికి పైగా పరిష్కారం అయ్యాయి. (2024తో పోలిస్తే 47 శాతం, 2023తో పోలిస్తే 26 శాతం బిల్డింగ్ అనుమతులు పెరిగాయి). మొత్తం ఈ దరఖాస్తుల ద్వారా 88.15 లక్షల చదరపు మీటర్లకు పైగా బిల్ట్ అప్ ఏరియాకు అనుమతులు ఇవ్వడం జరిగింది.

**మొత్తం 6,079 ఫైళ్ళు పరిష్కారం అయ్యాయి..**

ఇకపోతే 2025లో హెచ్ఎండీఏ మొత్తం 3,677 కొత్త దరఖాస్తులను స్వీకరించిందని వీటిలో బహుళ అంతస్తుల భవనాల (ఎంఎస్బీ) అనుమతులు, ఓపెన్ ప్లాట్ లతో లేఅవుట్, గృహాలతో లేఅవుట్ మరియు భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. వాటిలో 2,887 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసి 79 శాతం ఆమోద రేటును సాధించామని ఆయన వివరించారు. 2024లో 3,209 కొత్త దరఖాస్తులలో 1,216 అనుమతులు ఇచ్చి 38 శాతం ఆమోదం రేటు సాధించామని అన్నారు. 2023లో కొత్త దరఖాస్తులకు అనుమతులను ఇవ్వడంలో 58 శాతం ఆమోద రేటు నమోదయ్యిందని ఆయన చెప్పారు. 2023 ముందు కన్నా ఇప్పుడు అనుమతులు మంజూరు చేయడంలో గణనీయమైన వేగాన్ని సాధించామని తెలిపారు. నిర్మాణదారులకు, ప్రజలకు తమ సంస్థ ఒక నమ్మకాన్ని కలిగించడంతో వారిలో సానుకూల స్పందన వస్తోందని హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ తెలిపారు. నిర్దిష్ట కాలపరిమితిలో వివిధ భవనాలు, లేఔట్ లు, లేఔట్ గృహాలు, బహుళ అంతస్తుల భవనాలకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో కూడా హెచ్ఎండిఏ ఉన్నత ఫలితాలను సాధించిందని హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడించారు. 2025 జనవరి నుండి సెప్టెంబర్ మధ్య కాలంలో మొత్తం 6,079 ఫైళ్ళు పరిష్కారం అయ్యాయని, ఇది 2024తో పోలిస్తే 49 శాతం మరియు 2023తో పోలిస్తే 36 శాతం అధికం అని ఆయన వెల్లడించారు. ఈ గణాంకాలు హెచ్ఎండిఏ నిబద్ధతను ప్రతిబింబిస్తాయని ఇది పౌరులు, నిర్మాణదారులు మరియు పెట్టుబడిదారుల కోసం విశ్వసనీయమైన వాతావరణాన్ని ఏర్పరుస్తోందని హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు.

**ఫైళ్లను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం..**

ఫైళ్ళను త్వరితగతిన పరిష్కరించడంలో హెచ్ఎండీఏ ముందు వరుసలో ఉంది అని హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం ఫైళ్లను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు పరిశీలన, ఇందుకు సంబంధించి ప్రతి అధికారిని జవాబుదారీ చేయడం, కమిషనర్ స్థాయిలో రోజువారీ వాటిని సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం పెండింగ్ ఫైళ్ళను ఒక నిర్దిష్ట కాలపరిమితి ప్రకారం విభజించి వాటిని పరిశీలించే యంత్రాంగాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. 60 రోజులకు పైగా పెండింగ్ లో ఉన్న ఫైళ్ళు, 30 నుండి 60 రోజులుగా పెండింగ్ లో ఉన్న ఫైళ్ళు, 30 రోజుల లోపు పెండింగ్ లో ఉన్న ఫైళ్ళు, వారం రోజులుగా పెండింగ్ లో ఉన్న ఫైళ్ళుగా మొత్తం ఫైళ్ళను విభజించుకుని, ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించే విధానాన్ని అమలు చేస్తోంది హెచ్ఎండిఏ. ఇది మంచి ఫలితాలను ఇస్తోందని హెచ్ఎండీఏ కమిషనర్ తెలిపారు. మొత్తం దరఖాస్తుల రావడం, వాటిని పరిష్కరించడం తమ పని విధానంలో చాలా ముఖ్యంగా భావిస్తున్నామని, అందుకే మంచి ఫలితాలు సాధించగలిగామని హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడించారు.



## దానం నాగేందర్
# మా ఎమ్మెల్యే

కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గం ఇబ్రహీం నగర్‌లోని బస్తీ దవాఖానకు కేటీఆర్ పరిశీలించారు. బస్తీ దవఖానను సందర్శించి పేషెంట్‌ల సమస్యలపై ఆరా తీశారు. గతంలో ప్రజలకు, ముఖ్యంగా పేదలు అందరికీ అందుబాటులో ఉండేలా 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశాము. వాటితో పాటు తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా పరీక్షలు కూడా అందుబాటులోకి తేచ్చామని అన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టారు, బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. అందులో భాగంగానే ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బస్తీ దవాఖానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై కేటీఆర్ విమర్శలు చేశారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయినప్పటికీ, ఆయన పేరు కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఎలా వచ్చింది?. ఆయన ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీలో చేరారు అనే విషయం ప్రజలందరికీ తెలుసు. ఎమ్మెల్యేల చేరికల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి నీతి లేదు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలకు, తాము ఏ పార్టీలో చేరామో కూడా స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉంది. మా పార్టీ ఎమ్మెల్యేలు చేరలేదని చెప్తూనే, సిగ్గు లేకుండా మా పార్టీ ఎమ్మెల్యే పేరును స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఏఐసీసీ చేర్చిందని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

# ఆపరేషన్ హిడ్మా

200 మందితో లొంగిపోతారని ప్రచారం

హిడ్మా అడుగులపై సర్వత్రా ఉత్కంఠ

**భద్రాచలం, మహా :** మావోయిస్టుల మూకుమ్మడి లొంగుబాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ పార్టీలో కీలక మిలిటరీ నేత, ఫస్ట్ బెటాలియన్ కమాండర్ హిడ్మా లొంగిపోయేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. 200 మంది మావోయిస్టులతో కలిసి ఆయన సరెండర్ అయ్యేందుకు సన్నద్ధం అవుతున్నారని ప్రచారం వినబడుతోంది. సుక్మా జిల్లాకు చెందిన హిడ్మా మావోల స్కూల్లో చదివి చిన్నవయసులోనే ఉద్యమంలోకి వెళ్లాడు. భద్రన్న, నంబాల, చలపతి వంటి అగ్రనేతలతో పనిచేసి ఎన్నో దాడులకు వ్యూహరచన చేశాడు.. ఆయన లొంగిపోతే మావోయిస్టు ఉద్యమం తుదిదశకు చేరుకున్నట్లేనని కేంద్రం భావిస్తోంది. భద్రతా బలగాలపై జరిగిన అనేక దాడుల వెనుక హిడ్మా కీరోల్‌గా భావిస్తారు. వరుస లొంగుబాట్ల నేపథ్యంలో హిడ్మా ఎక్కడ ఉన్నాడన్న చర్చ దేశమంతటా అన్ని వర్గాల్లో జోరుగా నడుస్తోంది. కేంద్ర, రాష్ట్ర కమిటీల నేతలే సాయుధ పోరాటానికి విరమణ ప్రకటించి, ఆయుధాలతో సహా లొంగిపోతుంటే ఏ మాత్రం అదరకుండా, బెదరకుండా పార్టీ లైనును కొనసాగిస్తున్న హిడ్మాను పట్టుకోకపోతే నక్సలిజం నిర్మూలన పూర్తి అయినట్టు కాదని ఛత్తీస్‌గఢ్ పోలీసులు భావిస్తున్నారు. అయితే హిడ్మా తెలంగాణలో లొంగిపోతారా లేక ఛత్తీస్ గఢ్ లో లొంగిపోతారా అనే అంశం పై తీవ్రంగా చర్చ సాగుతోంది. తన సహచరులను కోల్పోకముందే పోలీసుల ఎదుట లొంగిపోవడమే మంచిదన్న ఆలోచనలో హిడ్మా ఉన్నట్లు తెలుస్తోంది. హిడ్మా అడుగులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## కేంద్రంపై మండిపడ్డ
# మావోయిస్టులు

కార్పొరేట్ ల కోసమే కగార్ యుద్ధం అని మండిపాటు

24న దేశవ్యాప్త బంద్ కు పిలుపు

**రాయ్‌పూర్, మహా :** దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై ఆ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అక్టోబర్ 24వ తేదీన దేశవ్యాప్త బంద్‌కు మావోయిస్ట్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు అభయ్ పేరుతో కేంద్ర కమిటీ మంగళవారం ఒక లేఖను విడుదల చేసింది. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని సాగిస్తూ.. మావోయిస్టులను హత్య చేయడానికి నిరసనగా ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు కేంద్ర కమిటీ విడుదల చేసిన ఆ లేఖలో పేర్కొంది. మావోయిస్టుల హత్యలకు నిరసనగా అక్టోబర్ 23వ తేదీ వరకు నిరసన వ్యక్తం చేయాలని ఆ పార్టీ స్పష్టం చేసింది. ఆపరేషన్ కగార్ నిలిపి వేయడానికి దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్మించాలని ఆ లేఖలో సూచించింది. 2026, మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలించి.. మావోయిస్ట్ రహిత భారత్‌గా మారుస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టి.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ఆ క్రమంలో మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని కేంద్రం పిలుపు నిచ్చింది. దాంతో వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఇక దేశంలోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జార్ఖండ్ మినహా మిగతా అన్ని రాష్ట్రాలు మావోయిస్టు రహితంగా మారాయి. అయితే ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం మావోయిస్టులు బలంగా ఉన్నారు. దీంతో ఆ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర బలగాలు.. నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. పలువురు మావోయిస్టు అగ్రనేతలు మరణించారు. అలాగే వందల మంది మావోయిస్టులు సైతం మృతి చెందారు. భారీగా మావోయిస్టులు సైతం అరెస్టయ్యారు. ఇంకోవైపు తాజాగా మావోయిస్టు పార్టీలో అగ్రనేతగా ఉన్న మల్లోజులు వేణుగోపాల్ దాదాపు వంద మంది మావోయిస్టులతో కలిసి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. అలాగే ఛత్తీస్‌గఢ్ సీఎం ఎదుట మరో మావోయిస్టు అగ్రనేత ఆశన్న సైతం వందల మందితో కలిసి లొంగిపోయరు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి మావోయిస్టులు భారీగా ఆయుధాలను అప్పగించారు. అయితే మల్లోజుల వేణుగోపాలు, ఆశన్నలు ప్రభుత్వం ఎదట లొంగిపోవడంపై మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి నిప్పులు చెరిగింది. ఇది ముమ్మాటికి విప్లవ ద్రోహమంటూ వారిపై మండిపడింది..

# జూబ్లీహిల్స్@180

ఉప ఎన్నికకు భారీగా నామినేషన్లు

ముగిసిన నామినేషన్ల గడువు

నేటి నుంచి పరిశీలన.. 24 వరకు విత్ డ్రాకు గడువు

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో నామినేషన్ల గడువు ముగిసింది. చివరి రోజైన ఇవాళ భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్ల దాఖలు పూర్తి చేశారు. ఇప్పటివరకు 180 నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల గడువు ముగిసింది. చివరి రోజు 3 గంటల లోపు ఆర్వో ఆఫీస్ గేట్ లోపల ఉన్నవారందరికీ నామినేషన్ వేసే అవకాశం కల్పించారు అధికారులు. మంగళవారం మొత్తం 188 టోకెన్లు జారీ చేశారు జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి.

**24 వరకు నామినేషన్ల ఉపసంహరణ..**

దాఖలైన నామినేషన్లను నేటి నుంచి ఆర్వో సాయిరాం పరిశీలించనున్నారు. 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. వచ్చే నెల 11న పోలింగ్ జరగనుండగా 14న ఓట్ల లెక్కింపు చేపడతారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇక నవంబర్ 14న కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపు ఉంటుందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు.

# హరీష్ రావు ప్రమాణం చేయగలవా?

- ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా?
- కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా
- బీఆర్ఎస్ నేతకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మరోసారి కౌంటర్



**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఛాలెంజ్ విసిరారు. కేబినెట్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. కేబినెట్ సమావేశంలో వ్యక్తిగత అంశాలు చర్చ చేయలేదని తాను ప్రమాణం చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారంపై మాజీ మంత్రికి సవాల్ విసిరారు మంత్రి. 'సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామా? హరీష్ సెంటిమెంట్‌గా భావించే దేవుడిపై ప్రమాణం చేయగలడా? ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా? మా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి నేను ప్రమాణం చేస్తాను. నేను ముఖ్యమంత్రి అనుమతి తీసుకొని వస్తాను. నువ్వు (హరీష్) ఆరోపించిన విషయాలను నిజమని ప్రమాణం చేయగలవా? ఏ శనివారం వస్తారో హరీష్ రావు చెప్పాలి. ఛాలెంజ్‌ను హరీష్ స్వీకరించాలి. కొండా సురేఖ బిడ్డ.. మా అందరికీ బిడ్డ లాంటిదే' అంటూ మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. హరీష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా అంటూ ఫైర్ అయ్యారు. కేబినెట్లో జరగని విషయాలను జరిగాయని ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలపై దాదాపు 600 పైగా ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై గత ప్రభుత్వం క్రూరంగా ప్రవర్తించిందని విమర్శించారు. రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. పదేండ్లు మేమే రాజులం తామే మంత్రులం అన్నట్టు వ్యవహరించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దుయ్యబట్టారు.



## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి....

**ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

**యాదగిరిగుట్ట, మహా:** విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం శ్రీరామ్ విల్లాస్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ,ఏసీపీ శ్రీనివాస్ నాయుడు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ నుండి ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని పోలీసుల అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మారువలేనివి అన్నారు.. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన శ్రీరామ్ విల్లాస్ యాజమాన్యంకు అభినందనలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి...జిల్లా కలెక్టర్

**భువనగిరి, మహా;** నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భువనగిరి మండలం, గౌస్ నగర్, వలిగొండ మండలం మందాపూర్, గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు... గ్రామానికి ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, గ్రామంలో ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని . అవి ఏ ఏ దశలల్లో ఉన్నాయని తెలుసుకున్నారు.ఇప్పటి వరకు అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ కి డబ్బులు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. స్లాబ్ దశ పూర్తి అయినా ఇంటిని పరిశీలించారు. ఇప్పటి



వరకు అన్ని బిల్లులు వచ్చాయా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు .మిగతా పనులు కూడా పూర్తి చేసుకొని త్వరగా గృహప్రవేశం చేసుకోవాలి అని తెలిపారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

**కలెక్టర్ హనుమంతరావు**

**వలిగొండ, మహా:** వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు ఉప కేంద్రంలో ఎంత మంది సిబ్బంది ఉన్నారని. రోజు సిబ్బంది విధులకు హాజరవుతున్నారా లేదా అని అటెండన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. ఆసుపత్రికి రోజు ఓపి ఎంత మంది పేషెంట్లు వస్తున్నారని. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు ఏ రోగాలతో వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని సంబంధిత అధికారు



లను అడిగి తెలుసుకున్నారు. గత నెలలో ఎన్ని ఈ డి డి లు ఉన్నాయని. ఈ నెలలో ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. ఇప్పటి వరకు అయిన ప్రసవాలు అన్ని ఎక్కడ జరిగాయ అని అడిగి తెలుకున్నారు. మంచిగా సేవలు అందిస్తున్న సిబ్బందిని కలెక్టర్ సన్మానించారు.

## మెను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

**కలెక్టర్ హనుమంతరావు**

**వలిగొండ, మహా:** మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం రోజు వలిగొండ మండలంలోని శ్రీ వెంకటేశ్వర జెడ్పీఎచ్ ఎస్ స్కూల్ ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు... స్కూల్ లో మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని . ప్రస్తుతం 10 వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రధానోపాధ్యాయుని అడిగి తెలుసుకున్నారు సిలబస్ ఎంత వరకు పూర్తి అయిందని స్కూల్ ప్రిన్సిపాల్ ని అడిగి తెలుసుకున్నారు.10 వ తరగతి సోషల్ క్లాస్ ను కలెక్టర్ విద్యార్థులతో కలిసి వినడం జరిగింది.విద్యార్థుల చేత ఇండియా మ్యాప్ వేయించారు. విద్యార్థులు అందరూ ఇప్పటి నుండి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలి అన్నారు.



ఈ సంవత్సరం కూడా ఈ స్కూల్ లో 100% ఉత్తీర్ణత సాధించాలని, జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. తత్వ ఎక్కువ మార్కులు వచ్చిన వారికి సైకిల్స్ బహుమతి గా ఇవ్వడం జరుగుతుందని . అలాగే మీ తల్లిదండ్రులను కూడా సన్మానించడం జరుగుతుంది అని సూచించారు.

## జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు..

### కన్సల్టెంట్‌గా అడ్వొకేట్ ఉమేష్ సాల్వి

**న్యూఢిల్లీ:** జస్టిస్ యశ్వంత్ వర్మ నోట్ల కట్టల వివాదంలో భాగంగా ఆ కేసును విచారించే జడ్జిల కమిటీకి సహాయం చేయడానికి న్యాయవాది కరణ్ ఉమేష్ సాల్వి కన్సల్టెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా.. ఉమేష్ సాల్విని కన్సల్టెంట్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జస్టిస్ వర్మపై అభిశంసన ప్రక్రియలను ప్రారంభించడానికి లోక్‌సభలో మద్దతు ఇచ్చిన తీర్మానం తర్వాత ఈ కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా తాజాగా సదర కమిటీకి న్యాయ సహాయం అందించడానికి కరణ్ ఉమేష్ సాల్విని కన్సల్టెంట్‌గా నియమించారు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా. జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలన్న ప్రతిపాదనపై ఆగస్టు నెలలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో 146 మంది ఎంపీలు సంతకాలు చేశారు. దీనిలో



భాగంగా ముగ్గురు సభ్యులతో కూడిన జడ్జిల ప్యానల్‌ను నియమించగా, తాజాగా కరణ్ ఉమేవ్ సాల్విని కన్సల్టెంట్‌గా నియమించారు. ఈ కమిటీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మదన్ మోహన్ శ్రీవాస్తవ్, సీనియర్ న్యాయవాది బి.వి. ఆచార్యలు సభ్యులుగా ఉన్నారు.

# ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం!

- రైతులను ఇబ్బందులు పెట్టి మద్దతు ధరలో కోత విధించొద్దు
- అన్యాయం చేయాలని చూసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- సీసీఐ అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరిక

**ఖమ్మం, మహా:** భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట కార్యాచరణను అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తేమ శాతం పేరుతోగానీ, తరుగు పేరిట గానీ రైతులను అనవసరంగా ఇబ్బందులు పెట్టి మద్దతు ధరలో కోత విధిస్తే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆయన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులను, మిల్లు యజమానులను హెచ్చరించారు. తిరుమలాయపాలెం మండలం గోల్ తండా గ్రామంలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు జి. లక్ష్మీ బాయితో కలిసి మంగళవారం మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుత వానాకాలం సీజన్ 2025లో పాలేరు నియోజకవర్గంలో ప్రారంభమైన మొట్టమొదటి సీసీఐ కేంద్రం ఇదేనని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.

రైతులు తమ పత్తిని ఎలాంటి ఆందోళన లేకుండా అమ్ముకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి వివరించారు. ప్రతి సీసీఐ కేంద్రం వద్ద వచ్చే అభ్యంతరాలను, ముఖ్యంగా తేమ శాతం విషయంలో రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకు స్థానిక వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. రైతులకు అన్యాయం చేయాలని చూసేవారిపై ఈ కమిటీ తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఆత్మ కమిటీ చైర్మన్ శివరామకృష్ణ, డిసిసిబి డైరెక్టర్ బి. రాజశేఖర్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఈసారి నవీన్‌కు.. 2028లో మేమే

### వచ్చే ఎన్నికల్లో మా తడాఖా చూపిస్తాం.. అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీ.నవీన్ యాదవ్ కు తమ పార్టీ మద్దతు ఇస్తున్నదని, అందుకే అభ్యర్థిని బరిలో నిల్పోబెట్టలేని ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. ఈ ఎన్నికల్లో గెలవడం మూలంగా కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు కాదని, పాత ప్రభుత్వం కూలిపోదని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థికి అవకాశం ఇచ్చారని, కానీ ఎక్కడా అభివృద్ధి జరగలేదని ఆయన ఆరోపించారు. వార్డులలో ఎక్కడా కూడా ఆ ఛాయలు కన్పించడం లేదని, ఓటర్లు అభివృద్ధి చేసే వారికే ఈసారి ఓటు వేస్తారన్నారు. కావున యువకుడు అయిన నవీన్



యాదవ్ కు ఓట్లు వేసి గెలిపించాలని అసదుద్దీన్ ఓటర్లను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో మూడేళ్లు అధికారంలో ఉంటుందని, ఈ ఎన్నికల మూలంగా ప్రభుత్వంలో మార్పులు ఉండవనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.



## మాజీ డీజీపీ కొడుకు కేసులో భయానక ట్విస్ట్

మాజీ డీజీపీ కొడుకు మృతి కేసులో భయంకరమైన ట్విస్ట్ వెలుగు చూసింది. తన భార్యతో తన తండ్రి అనైతిక సంబంధం పెట్టుకున్నాడని.. అప్పటి నుంచి తనను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలు పెట్టారని, చివరకు చంపేందుకు కూడా వెనకడలేదని చెబుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీంతో ఒక్కసారిగా అలజడి రేగింది. పంజాబ్ మాజీ డీజీపీ (మానవ హక్కుల) ముహ్మద్ ముస్తాఫా తనయుడు అకీల్ అక్తర్(35)లో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పంచకుల నివాసంలో అక్టోబర్ 16వ తేదీన అకీల్ విగతజీవిగా కనిపించాడు. అయితే డ్రగ్ ఓవర్‌డోస్ కారణంగానే చనిపోయాడంటూ ఆ కుటుంబం చెబుతూ వచ్చింది. ఈలోపు పొరుగింట్లో షామ్‌షుద్దీన్ చౌద్రీ ఈ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఈ కేసు దర్యాప్తులో ఉండగానే.. సంచలన వీడియో ఒకటి బయటకు వచ్చింది. అందులో తన తండ్రి తన భార్యతో సంబంధం పెట్టుకున్నాడని, తననూ చంపేందుకు కుట్ర కూడా పన్నాడని అకీల్ వివరించాడు. ఆగస్టు 27వ తేదీన రికార్డు చేసిన ఆ వీడియో 16 నిమిషాల నిడివి ఉంది. ఇంకా అందులో.. తన తండ్రి ముస్తాఫా తన భార్యతో అనైతిక సంబంధం పెట్టుకున్నాడని.. దీంతో 2018లో ఆమెతో విడాకులు తీసుకున్నానని, ఈ విషయం తన తల్లీ, సోదరికి కూడా తెలుసని, వాళ్లు అభ్యంతర వ్యక్తం చేయకపోగా తననే నాశనం చేశారని వాపోయాడు. తనను మానసిక రోగిగా ప్రచారం చేస్తూ రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపారని, తన వ్యాపారాన్ని చేజిక్కించుకున్నారని.. హింసించడంతో పాటు తప్పుడు కేసులు పెడతానని బెదిరించారిని అకీల్ చెప్పుకొచ్చాడు. ఈ వీడియో ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేయాలని ఫిర్యాదుదారి షాముద్దీన్ కోరుతున్నాడు. దీంతో.. ముస్తాపా, ఆయన సతీమణి(మాజీ మంత్రి కూడా) రజియా సుల్తానా, వీళ్ల కూతురు, కోడలి(మాజీ) పైనా బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటన పంజాబ్ రాజకీయ, పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.




UNITED KINGDOM
CERTIFICATE
OF WORLD RECORD
LONDON BOOK OF WORLD RECORD

## వరల్డ్ రికార్డుతో సీఎం సిద్ధరామయ్య నవ్వులపాలు?

**బెంగళూరు:** తమ ప్రభుత్వం చేపట్టిన పథకానికి 'లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' నుంచి సర్టిఫికెట్ అందిందని గొప్పగా ప్రకటించిన కర్ణాటక సీఎం ఇప్పుడు నవ్వులపాలవుతున్నారు. ఆ సర్టిఫికెట్ నకిలీదని తేలిన దరిమిలా సోషల్ మీడియాలో నెటిజన్లు ఆయనపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల.. రాష్ట్రంలోని మహిళలకు 'శక్తి యోజన'పేరుతో ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించామని, ఈ నేపథ్యంలో మహిళలు అత్యధికంగా ఉచితంగా బస్సు ప్రయాణాలు చేశారని తెలిపారు. దీనిని ప్రపంచ రికార్డుగా 'లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' గుర్తించిందని ప్రకటించారు. కర్ణాటక రెండు చరిత్రాత్మక రికార్డులతో ప్రపంచ వేదికపైకి ప్రవేశించిందని పేర్కొన్నారు. 'శక్తి యోజన' పథకం కింద మహిళలు మొత్తంగా 564.10 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని, ఇది మహిళల రోజువారీ ప్రయాణాలలో కొత్త రికార్డు అని సిద్ధరామయ్య తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. దీనికితోడు కర్ణాటక రాష్ట్ర రవాణా సంస్థ 1997 నుంచి ఇప్పటివరకూ 464 జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకుందని చెబుతూ, రెండు సర్టిఫికెట్ల ఫొటో కాపీలను షేర్ చేశారు.ఈ రెండు సర్టిఫికెట్లపై లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ (ఇండియా)డాక్టర్ అవినాష్ డి. సకుండే, యూరోపియన్ యూనియన్ హెడ్(క్రొయేషియా)డాక్టర్ ఇవాన్ గచినాల సంతకాలున్నాయి. ఈ సర్టిఫికెట్లను గమనించిన ప్రతిపక్ష పార్టీలు ఇది కేవలం ప్రచార స్టంట్ అని ఆరోపించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత పథకాలకు అధికంగా ఖర్చు చేస్తోందని, రాష్ట్రంలోని నాలుగు రవాణా సంస్థలు మొత్తం రూ.6,330 కోట్ల అప్పును కలిగి ఉన్నాయని, ప్రస్తుతం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపాయి. కాగా 'లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' బ్రిటన్‌లో నమోదైన ఒక ప్రైవేట్ సంస్థ. ఈ సంస్థ అధికారికంగా 2025, జూలై 15న మూతపడింది. అవినాష్ ధనంజయ్ సకుండే 2024, జూన్ 28న ఈ సంస్థ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇప్పుడు మనుగడలో లేదు. దీంతో కర్ణాటక ప్రభుత్వం చూపిస్తున్న సర్టిఫికెట్లు చెల్లనివని నిరూపితమయ్యాయి. బీజేపీ నేత అమిత్ మాలవియ కర్నాటక ప్రభుత్వం చూపిస్తున్న సర్టిఫికెట్లు ఫేర్ అంటూ ఆధారాలతో సహా షేర్ చేసిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. దీంతో నెటిజన్లు సీఎం సిద్ధరామయ్యపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

## డీకేతో కిరణ్ మజుందార్ షా భేటీ



**బెంగళూరు:** కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో బయోకాన్ ఛైర్మన్ కిరణ్ మజుందార్ షాభేటీ అయ్యారు. బెంగళూరు రోడ్ల దుస్థితి, చెత్త సమస్యలపై ఇటీవల బయోకాన్ ఛైర్మన్ పోస్టులు పెట్టారు. దీనిపై డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. కిరణ్ మజుందార్‌కు మద్దతుగా నిలిచిన పారిశ్రామిక వేత్త హర్ష్ గొయెంకా.. సమస్యకు పరిష్కారం వెతకకుండా.. రాజకీయాలా? అంటూ నేతలపై మండిపడ్డారు. ఈ రోడ్లపై వివాదం నేపథ్యంలో డీకేతో బయోకాన్ ఛైర్మన్ భేటీ కావడం విశేషం. సమావేశంలో నగర మౌలిక సదుపాయాలపై ఆమె చేసిన విమర్శలపై చర్చ జరిగినట్లు సమాచారం. శివకుమార్ ఆమెకు సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ''ఈ రోజు తన నివాసంలో బయోకాన్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ వ్యాపారవేత్త కిరణ్ మజుందార్‌షాను కలవడం ఆనందంగా ఉందంటూ డీకే శివకుమార్ ట్వీట్ చేశారు. బెంగళూరులో అభివృద్ధి, ఆవిష్కరణలు, రాష్ట్ర ప్రగతి దిశలో ముందుకు సాగే మార్గం గురించి తాము చర్చ జరిపాం'' అంటూ ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో బెంగళూరు రోడ్ల పరిస్థితిపై ఓ విదేశీ విజిటర్.. బెంగళూరు నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానంటూ ఆమె ఓ పోస్టులో వెల్లడించారు. దీంతో ఆ పోస్టుపై బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా విమర్శలు చేశారు. డీకే శివకుమార్ రోడ్లపై పెడుతున్న పోస్టులపై కౌంటరిస్తూ.. కాస్త ఘాటుగా బదులిచ్చారు. మజుందార్ షా రోడ్లను అభివృద్ధి చేయాలనుకుంటే చేయవచ్చంటూ పేర్కొన్నారు. ఆమె వచ్చి అడిగితే.. ఆ గుంతలు పూడ్చేందుకు రోడ్లను కేటాయిస్తామన్నారు.

## దీపావళి బోనస్ ఇవ్వలేదని భారీ నష్టం తెచ్చారు!

**మహా:** దీపావళి బోనస్ ఇవ్వకపోవడంపై నిరసనగా ఉద్యోగులు చేపట్టిన ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి లక్షల రూపాయల ఆదాయ నష్టాన్ని కలిగించింది. ఆగ్రాలక్నో ఎక్స్ ప్రెస్ వేలోని ఫతేహాబాద్ టోల్ ప్లాజా వద్ద ఆదివారం గంటలపాటు గేట్లు తెరిచి ఉంచడంతో వేలాది వాహనాలు టోల్ చెల్లించకుండా టోల్ గేట్ దాటి వెళ్లిపోయాయి. దేశమంతా ఘనంగా జరుపుకొనే అతిపెద్ద పండుగ దీపావళి. ఈ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో కార్పొరేట్ కంపెనీల నుంచి చిన్నాచితకా సంస్థల వరకు తమ ఉద్యోగులకు ఎంతో కొంత మొత్తాన్ని దీపావళి బోనస్‌ల కింద ఇస్తుంటాయి. శ్రీసాయి, దాతార్ టోల్ ఆపరేటింగ్ సంస్థలకు చెందిన ఉద్యోగులు కూడా తమకు దీపావళి బోనస్ లభిస్తుందని ఆశించారు. గత వారం దీపావళి సందర్భంగా తమ బోనస్ లు తమ




బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని కంపెనీ హామీ ఇచ్చిందని, కానీ బోనస్‌లు జమ కాలేదని ఆందోళనకారులు తెలిపారు. దీంతో ఆగ్రహించిన ఉద్యోగులు ఆదివారం రాత్రి టోల్ బూత్ బూమ్ బారియర్‌ను తెరిచి సమ్మెలో కూర్చున్నారు. 10 గంటల పాటు కొనసాగిన ధర్నా అధికారులు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన తరువాత విరమించారు. "నేను ఏడాదిగా కంపెనీలో పనిచేస్తున్నాను. మాకు ఎటువంటి బోనస్ ఇవ్వలేదు. జీతాలు కూడా ఆలస్యంగా వస్తున్నాయి" అని ఒక ఉద్యోగి మీడియాకు తెలిపారు. బోనస్ ఇవ్వకపోగా కొత్త ఉద్యోగులను పెట్టుకుంటామని సంస్థ ప్రతినిధులు బెదిరించడం ఉద్యోగులకు మరింత ఆగ్రహాన్ని తెప్పించాయి. ఫతేహాబాద్ టోల్ ప్లాజా ఆగ్రాలక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై ఉంది. ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాన ప్రవేశ మార్గంగా ఉంటోంది. ఢిల్లీఎన్‌సీఆర్‌ను యమునా ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా లక్నోకు అనుసంధానించే ఈ మార్గం దేశానికి కీలకమైన వ్యూహాత్మక రహదారిగా గుర్తింపు పొందింది.

## 11 ఏళ్ల పాప కప్‌బోర్డ్ లో ఆత్మహత్య చేసుకుంటుందా?

**కోల్‌కతా:** ఆర్జీకర్ మెడికల్ కాలేజీ జూనియర్ వైద్యురాలి కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ మళ్లీ వార్తల్లోకి వచ్చాడు. ఈసారి అతని కుటుంబంలో మరో విషాదం చోటుచేసుకుంది. అతని మేన కోడలు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందింది. కోల్‌కతా భోవానిపూర్ ప్రాంతంలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. సోమవారం 11 ఏళ్ల బాలిక అల్మారాలో శవమై కనిపించింది. బాలికను పాక్షికంగా ఉరికి వేలాడుతుండడాన్ని స్థానికులు గుర్తించారు. బాలిక మరణానికి బాలిక తండ్రి భోళా సింగ్, సవతి తల్లి పూజ కారణమంటూ స్థానికులు వారిపై దాడి తెగబడ్డారు. తండ్రి, సవతి తల్లి.. బాలికను మానసికంగా,శారీరకంగా హింసించి ఆపై ప్రాణాలు తీశారు. ఈ దారుణంపై కోపంతో రగిలిపోయిన స్థానికులు భోళా సింగ్,పూజలకు దేహశుద్ధి చేశారు. స్థానికులు సవతి తల్లి జుట్టు పట్టుకుని తన్నారు. తండ్రిని బూట్లతో దాడి చేశారు.



సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.దాడి చేస్తున్న స్థానికుల నుంచి నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. బాలిక మృతిని అనుమానాస్పద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాలిక మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టానికి తరలించారు. పోస్టు మార్టం పూర్తయిన తర్వాత బాలికది ఆత్మహత్యనా? హత్యనా? అన్నది తెలుస్తోందని పోలీసులు తెలిపారు. అయితే, పోలీసుల తీరుపై స్థానికులు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 11ఏళ్ల బాలిక కప్‌బోర్డులో ఆత్మహత్య చేసుకుంటుందా? అని ప్రశ్నిస్తున్నారు. బాలిక మరణానికి కారణమైన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో 2024 ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. ఈ కేసుపై విచారణ పూర్తి చేసిన సీల్దా జిల్లా కోర్టు, సంజయ్ రాయ్‌ను ప్రధాన నిందితుడిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. అర్ధరాత్రి సమయంలో విధుల్లో ఉన్న వైద్యురాలిపై సంజయ్ రాయ్ అత్యాచారం చేసి హత్య చేసినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ దారుణ ఘటనపై దేశవ్యాప్తంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు.

మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ | 22-10-2025












# కత్రం.. సేవాస్త్రం

## జన్మభూమిపై యువ పారిశ్రామికవేత్త కత్రం శ్రీకాంత్ రెడ్డి మమకారం

### శ్రీమంతుడు.. రియల్ మహర్షిలా కత్రం శ్రీకాంత్ రెడ్డి సేవలు

### కత్రం చారిటబుల్ ట్రస్ట్ సేవలపై ప్రజల ప్రశంసలు



(మహా ప్రత్యేకం)

సొంత ఊరిపై మమకారంతో.. ఆయన అందిస్తున్న సేవలకు అక్కడి ప్రజలు మంత్రముగ్ధులవుతున్నారు. జన్మభూమికి సేవచేయడానికి ప్రజాప్రతినిధే కానవసరం లేదని, సొంత ఊరిపై ప్రేమ ఉంటే చాలని ఆయన నిరూపిస్తున్నారు. తనను విత్తునుండి చెట్టయ్యేవరకు ప్రేమగా పెంచిన తల్లి లాంటి ఊరి రుణం, తన ప్రాంత రుణం తీర్చుకోవాలని ఆ యువ పారిశ్రామికవేత్త కంకణం కట్టుకోవడం రాష్ట్రంలోనే ఆసక్తికరంగా మారింది. కత్రం ఛారిటబుల్ ట్రస్ట్ స్థాపించి.. సొంత ఊరి సేవలో, మండల సేవలో, నియోజకవర్గ సేవలో కత్రం శ్రీకాంత్ రెడ్డి చూపుతున్న చొరవ చూస్తే.. వావ్ అని అభినందించకుండా ఉండలేరు. ఒక శ్రీమంతుడు, ఒక మహర్షి లాంటి సినిమాలు.. కత్రం శ్రీకాంత్ రెడ్డి చేస్తున్న సేవలు చూస్తే గుర్తొస్తాయి. రియల్ మహర్షి అని, కిష్టాపురం శ్రీమంతుడు అని అక్కడి యువత ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. కోదాడ నియోజకవర్గంలోని.. అనంతగిరి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి సొంత గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో అందిస్తున్న సేవలు అభినందనలందుకుంటున్నాయి. పల్లె నుండి సప్తసముద్రాలు దాటి వెళ్ళి సగర్వంగా ఎదిగినా, వందలాదిమందికి ఉపాధినిస్తూ సిరిసంపదలతో ఉన్నా.. కన్న ఊరిపై ఆయన చూపే ప్రేమకు అక్కడి ప్రజలు జేజేలు పలుకుతున్నారు. ఇలా జేజేలు అందుకుంటూ.. సొంత ఊరికి సేవ చేస్తున్న కత్రం శ్రీకాంత్ రెడ్డి కార్యక్రమాలు ఇతర దేశాల్లో, వ్యాపారాల్లో అనూహ్యంగా ఎదిగిన యువతకు స్ఫూర్తిదాయకం. శ్రీకాంత్ రెడ్డి లాంటి యువతే నేడు దేశానికి కావాలని అక్కడి ప్రజలు అభినందిస్తున్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా.. ఎంత ఎదిగినా తన సొంత ప్రాంతం బాగుండాలని కోరుకునే యువకుడిగా ఆరోగ్య, విద్యారంగంలో చేయూతను అందిస్తున్నారు. కత్రం చారిటబుల్ ఫౌండేషన్ ఫౌండర్ కత్రం శ్రీకాంత్ రెడ్డి సేవలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు పలు సందర్భాల్లో ప్రశంసించారు. కత్రం ఆరోగ్యసేవను పద్మావతిరెడ్డి ప్రారంభించారు.

### పెద్దమనసు

సూర్యాపేట జిల్లాలోని అనంతగిరి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన కత్రం. శ్రీకాంత్ రెడ్డి కత్రం ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా అనంతగిరి లోని అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణానికి మొదటగా రూ.6లక్షలు, తర్వాత రూ.11లక్షలను విరాళంగా అందించి సొంత ప్రాంతంలో ఆలయాల ప్రగతిపై తన సహకారం చాటారు. కోదాడ పట్టణంలో నిర్మితమవుతున్న "లింగమతుల స్వామి" దేవాలయ అన్నదాన సత్రానికి రూ.10లక్షల సాయం అందించారు. తన స్వగ్రామం కిష్టాపురం గ్రామంలో మంచినీటి సమస్య తీర్చేందుకు దాదాపు ఏడు లక్షల రూపాయల వ్యయంతో "ప్యూరిఫైడ్ వాటర్" ప్లాంట్ ను ఏర్పాటుచేసి ఎన్నో ఏళ్ళుగా అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తీర్చడంలో తన వంతు ప్రయత్నం చేశాడు. విద్యా, ఆరోగ్యం, ఆలయాలకు వితరణలే కాకుండా.. కోదాడ, అనంతగిరి ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించేందుకు కత్రం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతీ ఏటా క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ తన క్రీడాసక్తిని కూడా చాటుకున్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు లక్షరూపాయల దాకా బహుమతులు అందిస్తూ తన ప్రాంత యువతను ప్రోత్సహిస్తున్నారు. సొంత ఊరి కోసం.. సొంత ప్రాంతం కోసం కత్రం శ్రీకాంత్ రెడ్డిలా సేవలు చేసే యువత అరుదు. పారిశ్రామికవేత్తగా రాణిస్తూ.. తను సంపాదించిన దాంట్లో సొంత లాభం కొంతమానుకుని దేశసేవలకు పాటుపడుతున్న కత్రంను స్థానికులే కాకుండా చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు కూడా అభినందిస్తున్నారు.

### కత్రం విద్యాచేయూత

ఉన్నత చదువులు చదవు కోవాలనే ఆరాటం, మదినిండా సాధించాలనే పట్టుదల.. శిఖరాగ్రాలకు ఎదగాలనే తపన ఉన్నా పేదరికం కారణంగా అందుకోలేని వారికి కత్రం శ్రీకాంత్ రెడ్డి ఆపద్బాంధవుడిలా మారారు. కత్రం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ఇద్దరు పేద విద్యార్థులు సంజీవ్ నాయక్ బానోత్, పాల్తియా లానిత్ చౌహాన్ లు ఎన్ ఐటీ ఢిల్లీ, ఐఐటీ గౌహతిలో ఇంజినీరింగ్ చదువుకోవడానికి సాయమందించారు. ఇంకా ఐఐటీ విద్యార్థిని నెమ్మది శ్రావ్యకు కూడా కత్రం విద్యాచేయూత పేరుతో చేయూతను అందించారు.

### కత్రం ఆరోగ్య సేవ

నేరుగా పల్లె వాకిళ్లకే వెళ్లి వైద్య సేవలు అందించే ఉద్దేశ్యంతో కత్రం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా "ఉచిత మొబైల్ ఆసుపత్రి ని ప్రారంభించారు. ఈ సేవలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విజయవంతంగా ఐదువిడతల క్యాంపులు పూర్తిచేశారు. ఈ మొబైల్ ఆసుపత్రి ద్వారా ఎంపిక చేసిన నాలుగు మండలాల్లోని 40 గ్రామాల్లో పూర్తి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు కూడా ఉచితంగా అందించారు. సామాజిక బాధ్యతతో కత్రం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ కత్రం శ్రీకాంత్ రెడ్డి చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమంపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ప్రతినెలా వేయి నుండి 1500మందికి ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ సేవల్లో స్థానికులు కూడా భాగస్వాములు అవుతుండగా, మొబైల్ ఆస్పత్రి ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి పాల్గొని కత్రం శ్రీకాంత్ రెడ్డిని అభినందించారు. కత్రం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీకాంత్ రెడ్డి అభిగ్నల కుమారుడు శివ్ కార్తికేయ తొలి పుట్టినరోజు సందర్భంగా కోదాడ లో కత్రం ఆరోగ్య సేవ కార్యక్రమం ప్రారంభం కాగా, మొబైల్ ఆస్పత్రి అందిస్తున్న సేవలపై స్థానికులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. తన అభివృద్ధికి మూలమైన ప్రాంతానికి ఏదైనా చేయాలన్న తపనతో ఆరోగ్యసేవలందిస్తున్న కత్రంను స్థానికులు దీవిస్తున్నారు.














# లక్ష్మీపూజలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

## ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు






**ఆదిలాబాద్ మహా :** ప్రజలందరికి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం దీపావళి పండగను పురస్కరించుకొని తన క్యాంపు కార్యాలయంలో తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి పిల్లలతో కలిసి వేద పండితుల మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా, భక్తి శ్రద్ధలతో లక్ష్మీపూజలను నిర్వహించారు.ప్రజలందరు సుఖసంతోషాలు ,సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,మహిళా విభాగం నేతలు,కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులందరికి మిఠాయిలు పంచుతూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం క్యాంపు ఆఫీస్ ఎదుట అందరూ ఆనందంగా బాణసంచా కాల్చి పండగ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, తుమ్మల వెంకట్ రెడ్డి, కొండా గంగాధర్, రాందాస్ నాక్లే, ఫైజుల్లాఖాన్, విలాస్ పటేల్, లోక ప్రవీణ్ రెడ్డి, బండారి సతీష్,కలాల శ్రీనివాస్, సంద నర్సింగ్ , దర్శనాల లక్ష్మణ్, జాఫర్ అహ్మద్, మంచాల మల్లయ్య, రంగినేని శాంతన్ రావు, బోనాగిరి సంతన్న,దేరా కృష్ణ రెడ్డి, సామ రూపేష్ రెడ్డి, దేవిదాస్ చారి, ఎం. ఏ షకీల్, దర్శనాల అశోక్, మామిడి మల్లా రెడ్డి, రాజా లింగన్న, అశోక్, శంకర్, ప్రభాకర్, ప్రశాంత్, ఎం. ఏ కయ్యుమ్, సాగర్, శంకర్, రాజు, ఖలీమ్ , అంజద్, తోఫిక్, నసీమ్, ఫజిల్, సిరాజ్, శ్రీలేఖ, జుబేదా, అఫ్రోజా తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థంగా సాయి భోజన్

**బెల్లంపల్లి, మహా:** ప్రజారక్షణలో అమరులైన పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్ధంగా బెల్లంపల్లి ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో మంగళవారం రోజు బాయిజమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిబోజన్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసులత్యాగాలు వెలకట్టలేనివని,సేవకు నిజమైన ప్రతీకలు అని కొనియాడారు. ప్రజారక్షణలో ప్రాణాలు విడిచిన పోలీసు అమరవీరులకు ఘన నివాళులు తెలుపారు.పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థంగా దాతలు,ట్రస్ట్ సభ్యుల సహకారంతో గర్భిణులకు, బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు అన్న వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గర్భిణీలు, బాలింతలు, రోగులు,అన్నార్తులు,ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు.



అన్నదానానికి చేయూతనిద్దాం..

ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాంఅన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవ స్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుం దని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ సూచించారు ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు, కాంపల్లి రాజేశ్వరి జేరిపోతుల చంద్రకళ సేవకులు పోతురాజుల తిరుపతి, బందెల కిరణ్ చునార్కర్ దేవాజి, దాగం శ్రీనివాస్,దాతలు పాల్గొన్నారు.



### దైవ నామస్మరణతోనే

# శాంతి జీవితం

## శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, మహా :**దైవ నామస్మరణతోనే శాంతి వంతమైన జీవితం సాధ్యం అని టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా సుబ్రహ్మణ్యం నగర్ కాలనీ లో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ పద్మశ్రీ దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమం లో జయప్రకాశ్ జైన్ ప్రభావతి దంపతులు లక్ష్మమ్మ, సుదర్శన్ కరుణశ్రీ, రాజు, రవి, రాజేష్, సురేందర్, జగన్, కరుణశ్రీ, ఉమాదేవి, రేణుక దేవి,కల్పనా దేవి, హేమ,శిరీష,సాధన, ఫలానీష్, సుగంధ్, అభి తదితరులు పాల్గొన్నారు

### అంతరించిపోతున్న ప్రాచీన కళలకు జీవం పోస్తుండటం

# అభినందనీయం-కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్, మహా :** నేటికీ గ్రామాలలో ఇలాంటి ప్రాచీన జానపద కళలు, సంస్కృతి, సాంప్రదాయాలు కొనసాగుతూ అంతరించిపోతున్న ప్రాచీన కళలకు జీవం పోస్తూ.. వాటిని కాపాడుతుండడం గర్వకారణ మని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామంలో జరిగిన జడకొప్పు లాట జానపద కోలాట నృత్య ప్రదర్శన కు శ్రేణులతో కలిసి హాజరయ్యారు.స్థానిక కాంగ్రెస్ నేతలు గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శక్తి స్వరూపిణీ అమ్మవారి జడ అల్లే సౌభాగ్యం దక్కినందుకు మీరెంతో అదృష్టవంతులని కళాకారులను అభినందించారు. జానపద పాటలు కోలాటం ఆటలతో కళాకారులు లయ తప్పకుండా జడ అల్లడం ఒక గొప్ప అనుభూతినిచ్చిందని అన్నారు. జడకొప్పులాట ఒక ప్రాచీన జానపద కళ అని దానిని నేటి వరకు కొనసాగిస్తున్నందుకు మనమంతా గర్వపడాలన్నారు.అంతే కాకుండా దానిని భవిష్యత్ తరాలకు కూడా అందించాలని ఆకాంక్షించారు. నేటి కాలంలో డబ్బు కంటే కూడా బంధాలు అనుబంధాలకు ఎక్కువ విలువనిస్తుండడం మన అదృష్టమన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల ఈసారి వేలాది ఎకరాలలో పంట నష్టం జరగడం దురదృష్ట కరమన్నారు.ఎకరానికి 10వేల నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పిల్లలు.. తల్లిదండ్రులు పెద్దలను గౌరవించాలని సూచించారు. బాగా చదువుకొని మంచి నడవడిక నేర్చుకోవాలన్నారు. పుణ్యం కోసం తీర్థయాత్రలు తిరగడం కంటే కనిపెంచిన తల్లిదండ్రులకు నమస్కరిస్తూ వారిని బాగా చూసుకుంటే అంతకంటే ఎక్కువ పుణ్యం లభిస్తుందని సూచించారు. జందాపూర్ లో ప్రతీ రెండేళ్ల కోసారైనా ఇలాంటి గ్రామీణ కళలను ప్రదర్శిస్తుండడం అభినందనీయమన్నారు.గ్రామానికి ఎలాంటి సమాయ సహకారాలు చేయడానికైనా తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కళల ప్రదర్శనకు ఆదిలాబాద్ లో ఒక ఆడిటోరియం ఉండాలనేది అందరి ఆలోచన గా ఉందని ఖచ్చితంగా దానిని సాధించుకునేందుకు కృషి చేద్దామన్నారు. అందరి ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని ,అన్ని రంగాలలో పిల్లలు రాణించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాన్నారు ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్ రావు, కొండ గంగాధర్, బండారి సతీష్, సందా నర్సింగ్, చిల్కూరి సతీష్, ఎల్చాల దయాకర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



# ఈ నెల 25లోగా సిటిజన్ సర్వేలో ప్రజలు పాల్గొనాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** ఈ నెల 25 లోగా సిటిజన్ సర్వేలో ప్రజలు పాల్గొనాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు. మంగళవారం తన సాంబార్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైసింగ్ విజన్ 2047లో భాగంగా మీ స్వరం మీ దార్శనికత మా భవిష్యత్తు నినాదంతో రాష్ట్ర పౌరులు రాష్ట్ర పురోగతిని ఊహించుకునే అంశాన్ని ప్రభుత్వంతో పంచుకోవాలనే ఉద్దేశంతో చేపట్టిన సిటిజన్ సర్వే కార్యక్రమంలో అక్టోబర్ 25 తేదీలోగా పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని తెలిపారు. 2047 నాటికి భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్రం జరుపుకునే నాటికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, రూపొందించే దీర్ఘకాలిక రోడ్డు మ్యాప్ తెలంగాణ రైసింగ్ విజన్ 2047 అంశాలతో డాక్యుమెంటరీ తయారీలో భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్.ఆర్.ఐ. లు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి ఈ సర్వేలో పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. రానున్న రోజులలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం రూపొందిస్తున్న తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంటరీని రూపొందించడంలో ప్రతి రాష్ట్ర పౌరుడు భాగస్వామ్యమై సిటిజన్ సర్వేలో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవాలని, ఇందు కొరకు www.telangana.gov.in/telanganarising వెబ్ సైట్ లో సందర్శించాలని తెలిపారు.

# పోలీసుల అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా లు

**మంచిర్యాల, మహా :** పోలీసుల అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా లు ఉద్ఘటించారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే)ను వారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధినిర్వహణలో 191 మంది పోలీసులు మృత్యువాత పడ్డారని పేర్కొంటూ అమరవీరుల పేర్లను అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్ చదివి అందరికీ వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ లు మాట్లాడుతూ ప్రజల కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసుల సేవలు ఎవరు మర్చిపోరాదని అన్నారు. ప్రజలలో మంచి పేరు పోలీస్ శాఖకు తీసుకు రావాలంటే పోలీసులకు చిత్తశుద్ధి, నీతీ, నిజాయితీతో పని చేయాలని వెల్లడించారు. అమరవీరుల కుటుంబాలను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందిని, వారికి ఏవైనా సమస్యలు ఎదురైన పోలీసు శాఖ తరపున పూర్తి సహకారం అందించాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి కరుణాకర్, గోదావరిఖని ఏసిపి ఎం రమేష్, మంచిర్యాల ఏసిపి ఆర్ ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఎవో శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇన్స్పెక్టర్లు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు ఆర్ఐలు ఆర్ఎస్ఐలు సిపిఓ సిబ్బంది స్పెషల్ పార్టీ ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పా గుచ్చాలు పెట్టి నివాళులు అర్పించిన పిదప, ఆర్.ఐ మల్లేశం సారథ్యంలో సాయుధ పోలీసులు శోక్ శ్రస్త్ చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.





### దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థుల

# పాత్ర కీలకమైనది

## పల్లే రాజు గౌడ్

**ఆమనగల్లు, మహా:** దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమైనదని యువ నాయకుడు పల్లే రాజు గౌడ్ అన్నారు.ఆమనగల్లు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ప్యాడ్స్ వాటర్ బాటిల్స్ విద్యార్థులకు అందజేశారు.విద్యార్థులు,గురువులనుగౌరవించాలని,తల్లిదండ్రుల పట్ల ప్రేమ భావాలను కలిగి ఉండాలని,అటువంటప్పుడు మాత్రమే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని,విద్యను అభ్యసించేటప్పుడు పూర్తి ఏకాగ్రతతో అభ్యసించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి జీవితాన్ని నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సైదులు,సాయి,లోకేష్, భారత్, మల్లేష్,జాంగిర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# సాత్నాల మండలంలో బీజేపీకి షాక్

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మేడిగూడ బీజేపీ కార్యకర్తలు

కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి.. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందడుగు



**ఆదిలాబాద్ మహా :** స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో నిత్యం చేరికలు జరుగుతున్నాయి. తాజాగా మంగళవారం సాత్నాల మండలం మేడిగూడ (ఆర్) గ్రామం నుండి పలువురు బీజేపీ నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అంతా కలిసి ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్ రావు , క్యాతం శివప్రసాద్ రెడ్డి ,మేడిగూడ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్

**ఆమనగల్లు, మహా:** యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలి, గ్రామీనా ప్రాంతంలోని క్రిడాకారుల లోని ప్రతిభను బయటికి తీయాలానే ఉద్దేశ్యం తోనే ఈ క్రికెట్ టోర్నమెంట్ నర్వహించానని డీకేపి ఎస్ డాన్స్ అకాడమీ ఫౌండర్ ప్రభుశంకర్ మాస్టరు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో రెండు రోజులపాటు నిర్వహించిన సర్కిల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్లో మొత్తం పది జెట్లు పాల్గొనగా చివరిగా ఉత్కంఠ పోరులో సర్కిల్ హిట్టర్స్ టీమ్ విన్నర్స్ గా గెలిచారు, జి జి గ్లాడియేటర్స్ టీమ్ రన్నర్స్ గా నిలిచారు. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి మీసాల గోపి నగదు బహుమతిని అందజేశారు. ఈ టోర్నమెంట్ జయవంతం కావడానికి సహకరించిన గోరటి దేవేందర్, నీరటి (కొ్ట) రాజు, వరికుప్పల రాజు, కోరే మహేందర్, ఎనుమల్ల రమేష్, వస్పుల రంజిత్, కొమ్ము ప్రసాద్, తల్లోజు నరసింహ, రామకృష్ణ, వస్పుల సురేష్, క్రికెట్ క్రీడాకారులకు, అభిమానులకు డ్యాన్స్ మాస్టర్ ప్రభుశంకర్ ధన్యవాదాలు తెలియజేశారు.

# దీపావళి వేడుకల్లో కంది శ్రీనివాస రెడ్డి





**ఆదిలాబాద్ మహా :** దీపావళి పండగను అందరూ ఆనందోత్సహాల మధ్య జరుపుకున్నారని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇండ్లతో పాటు , ఆయా కార్యాలయాలు ,వ్యాపార ,వాణిజ్య కేద్రాలలో లక్ష్మీ పూజలతో అమ్మ వారి కరుణ కటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు. సోమవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని పలు దుకాణాలలో జరిగిన లక్ష్మీ పూజలకు హాజరై ఆయా యాజమానులకు వారి కుటుంబ సభ్యులకు దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

# అమరలు త్యాగం వెలకట్టలేం

**ఆమనగల్లు,మహా:** సమాజ, ప్రజల శ్రేయస్సు కోసం విధి నిర్వహణలో ప్రాణాలను ఫణంగా పెట్టి అమరులైన పోలీసులు త్యాగం వెలకట్టలేనిదని ఆమనగల్లు సిఐ జానకిరాం రెడ్డి కొనియాడారు. పోలీసు అమరవీరుల దినోత్సవంను పురస్కరించుకొని మంగళవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో విధి నిర్వహణలో అసువులు బాసిన దివంగత ఎస్సై కాసం హనుమంత రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, జోహార్లు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర కీలకమైనదని, వారి సేవలు అభినందనీయమని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు....




# దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** జామిని గ్రామం తన కెంతో ప్రత్యేకమైనదని ,ఆదివాసీలకు ఎల్లప్పుడూ తన అండదండలుంటాయని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం సాత్నాల మండలం జామిని గ్రామాన్ని ఆయన సందర్శించారు. దీపావళి సందర్భంగా ఆదివాసీలు నిర్వహించుకునే దండారి ముగింపు వేడుకలలో పాల్గొని వారికి దండారి శుభాకాంక్షలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓట్లేసిన ఈ గ్రామస్తులను తన కృతజ్ఞతలు తెలిపారు. దండారి అనేది ఆదివాసీలు పట్టే ఒక దీక్షలాంటిదని కఠిన నిమాలతో భక్తి శ్రద్ధలతో పది రోజుల పాటు ఆదివాసీలు కలిసికట్టుగా ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనందదాయకమని అన్నారు. దండారీలతో కలిసి నృత్యం లో కదం కలిపారు. జామిని గ్రామానికి 40 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందన్నారు. రెండో విడతలో మరో 40 ఇండ్లు మంజూరయ్యేలా కృసి చేస్తానన్నారు. ఆదివాసీలకు ఎల్లవేళలా తాను అండగా ఉంటానన్నారు. ఆదివాసీలు అందరూ అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ ఏడు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10వేల రూపాలయ ఆర్థిక సాయం అందేట్టు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్ రావ్ , కొండ గంగాధర్ , సెడ్మకె ఆనందర్ రావు, అల్చెట్టి నాగన్న, సామ రూపేష్ రెడ్డి , రాజేశ్వర్ , ప్రవీణ్ రెడ్డి , ప్రతాప్, ఎంఏ షకీల్ , దేరా కృష్ణారెడ్డి , అవినాష్ ,సంటెన్న,మల్లారెడ్డి ,అశోక్,నాగన్న, శ్యామ్ రావు,రవిందర్, రఘోత్తమ్ రెడ్డి , మోహన్ ,తానాజి, భూమన్న, సాంబయ్య, షేక్ పారిఖ్, యాదవ్ రావు , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది.. కడ్తాల ఇన్స్పెక్టర్ గంగాధర్






**ఆమనగల్లు, మహా:** విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయని కడ్తాల ఇన్స్పెక్టర్ గంగాధర్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కడ్తాల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కడ్తాల జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీలలో 10 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్ లో మొదటి బహుమతి కడ్తాల్ టౌన్, రెండవ బహుమతి సలార్పూర్, మూడవ బహుమతి రావిచేడ్ జట్టు గెలుచుకున్నారని ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు.క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, పిఈటి భీముడు, ఫార్చున్ బటర్ఫ్లై సిటీ యజమాని లక్ష్మణ స్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**కడ్తాల పోలీస్ స్టేషన్‌లో అమరవీరులకు నివాళులు**

కడ్తాల పోలీస్ స్టేషన్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన, అమరులైన పోలీస్ అధికారులకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరంఇన్స్పెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. ప్రజలు, దేశ రక్షణలో ప్రాణం కంటే విధి నిర్వహణ గొప్పదని చాటిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు.

## కాలనీ సమస్యలు తీర్చాలని కమిషనర్‌కు వినతి



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లులోని విద్యానగర్ కాలనీవాసులు తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్ శంకరు మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కాలనీకి కృష్ణ మంచినీరు అందించాలని, ప్రమాదకర విద్యుత్ వైర్లు తొలగించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు నిర్మించి తమ ఇబ్బందులు తొలగించాలని విన్నవించారు.వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ వాసులు ఉదయ్ కిరణ్, మాద్గుల అరుణ్, వంశీ, ఛత్రపతి తదితరులు ఉన్నారు.

## ఉమా.. నువ్వు ఉన్నతికి ఎదగాలమ్మా.

- గ్రూప్ 2 ద్వారా సచివాలయంలో ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం సాధించిన గలినేని ఉమా
- అభినందించిన షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ
- ఇంతకు ముందు కానిస్టేబుల్ గా విధులు
- ఉమా విజయం పట్ల పోలీసుల ప్రశంసలు



**షాద్ నగర్, మహా:** చదువుకు తగ్గ ఉద్యోగంతో కానిస్టేబుల్ గా అవకాశాన్ని అందుకుంది.. ఒకవైపు ఇక్కడ సిన్సియర్ గా పనిచేస్తునే మరోవైపు గ్రూప్ 2 వైపు అడుగులు వేసింది. మొత్తానికి గ్రూప్ 2 ద్వారా అనుకున్నద లక్ష్యాన్ని సాధించి సచివాలయంలో ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో ఉద్యోగాన్ని సాధించింది. కేశంపేట పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుల్ ఉమా ఘనత ఇది. ఒక పరిశ్రమలో పనిచేసే యాదయ్య కూతురైన ఈ అమ్మాయి ఎమ్మెస్సి వరకు చదివి 2018 బ్యాచ్ లో కానిస్టేబుల్ గా ఉద్యోగాన్ని సంపాదించింది. తాజాగా మరో కొత్త విజయంతో అందరినీ ఆశ్చర్యపరిచింది.

**చదువుల తల్లి కృషి అద్భుతం**

ఆర్థిక పరిస్థితులను అధిగమించి చదువుల వైపు అడుగులు వేయడమే కాకుండా ఒక్కో మెట్టు ముందుకు సాగుతూ కానిస్టేబుల్ ఉమా సాధిస్తున్న విజయాలు నేటి తరానికి ఆదర్శమని షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ అన్నారు. తమ డిపార్ట్మెంట్లో పని చేస్తూ ప్రస్తుతం ఏకంగా సచివాలయానికి ఫైనాన్స్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగం చేసేందుకు వెళుతున్న ఉమను ఆయన అభినందించారు. మంగళవారం శాలువాతో సత్కరించి ప్రశంసల వర్షం కురిపించారు. పోలీసు కానిస్టేబుల్ గా చక్కగా పనిచేసి పేరు తెచ్చుకున్న ఉమ తాను ప్రస్తుతం చేపడుతున్న ఉద్యోగం లోను గొప్ప పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా భవిష్యత్తులో గ్రూప్ వన్ వంటివి రాసి ఉన్నత అధికారిగా గుర్తింపు పొందాలని అన్నారు. సిఐ నరహరితో పాటు ఇతర పోలీసు అధికారులు ఆమెను అభినందించారు..

## అమ్మమ్మ, మనుమరాలుని మింగిన చెరువు

### బట్టలు ఉతకడానికి వెళ్లి చెరువులో మునిగి మృత్యువాత

**గండిపేట, మహా:** బట్టలు ఉతకటానికి చెరువు వద్దకు వెళ్ళిన అమ్మమ్మ,మనుమరాలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని, గండిపేట మండలం,బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్, పీరం చెరువు లో జరిగింది. నార్సింగి సిఐ హరికృష్ణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 21 మంగళవారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల సమయంలో పీరంచెరువు గ్రామంలో జానురామ్ క్వార్టర్స్ సమీపంలో ఉన్న పీరం చెరువులో, పీరం చెరువు గ్రామానికి చెందిన యూసుఫ్ బీ(60), తన ఇద్దరు మనవరాలు అయిన సభియా(10),మరియు ఆయేషమ్మ (19),ముగ్గురు కలిసి సమీపంలోని చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు అమ్మమ్మ అయిన యూసుబి బట్టలు ఉతికే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోవడంతో,కాపాడేందుకు తన ఇద్దరు మనుమరాలు చెరువులోకి దిగారు. ఈ క్రమంలో యూసుఫ్ బి తో పాటు, మనుమరాలు సబియా నీటిలో మునిగి మృతి చెందగా మరో చిన్నారి చెట్టుకొమ్మను పట్టుకొని సురక్షితంగా పైకి వచ్చింది. అనంతరం స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న తన అల్లుడు మహమ్మద్ అక్కడికి చేరుకొని స్థానికుల సహాయంతో యూసుఫ్ బి మరియు సబియాలను బయటకు తీయగా అప్పటికే మృతి చెందటంతో, సమాచారం అందుకున్న స్థానిక నార్సింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపిన అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశామన్నారు.అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి కి కి తరలించామన్నారు.

## ఈనెల 25తో ముగియనున్న సిటిజన్ సర్వే

### ప్రతి ఒక్కరూ పాల్గొనాలి: కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వేకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందజేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25వ తేదీతో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in /telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి జిల్లా ప్రజలు ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు ,సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలియ చేశారు.

## పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలి

### రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్




**నస్పూర్, మహా :** మంచిర్యాల జిల్లా భీమిని మండలం అక్కలపల్లి గ్రామంలో పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. మంగళవారం భీమారం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతు సంఘం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బానేష్, భీమిలి మండల కార్యదర్శి దుర్గం రాజేష్ లు మాట్లాడుతూ ఎస్సీ. ఎస్టీ. బలహీన వర్గాలకు సంబంధించిన పేద రైతులు గత 50 సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. భూమిని ఆధారంగా చేసుకుని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరారు. పోడు భూములు సాగు చేసుకునే వారికి విషయంలో పట్టాలిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇంతవరకు ఇవ్వకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోడు భూములు సాగు చేసుకుంటున్నా రైతులకు పట్టాలు ఇవ్వాలని పట్టా పాస్ పుస్తకాలు లేకపోవడం వలన రైతు భరోసా పంట రుణాలు పొందలేక పోతున్నామని రైతులు కంటతడి పెడుతున్నారని వివరించారు. అప్పులు తెచ్చుకొని సాగు వ్యవసాయానికి ఖర్చు చేస్తే అకాల వర్షాల వలన పంట నష్టం జరిగి పంటకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగు రైతులకు పట్టాలు ఇవ్వాలని లేని ఎడల రైతులతో కలసి పట్టాలు వచ్చేవరకు రైతులను కూడగట్టి పోరాడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చప్పిడి అన్నారావు, దుర్గం ఇస్తారి, జుమ్మిడి శ్యామ్ రావు, దుర్గం బిక్కయ్య, చప్పిడి భీమయ్య, బుర్రి సంతోష్, చప్పిడి చిన్నయ్య, జాడి పోచయ్య, చప్పిడి పెంటయ్య, జుమ్మిడి సువాస్, చప్పిడి బుద్ధుల్, నజీర్, దుర్గం ఓంకార్ పాల్గొన్నారు.

## దొడ్డుకు బదులు సన్న బియ్యాన్ని పంచిన లాభం లేకపాయే



**నస్పూర్ మహా :** పేదలకు అందాల్సిన ప్రభుత్వ రేషన్ సన్న బియ్యాన్ని కూడా అక్రమ వ్యాపారాలు మహారాష్ట్రకు తరలి స్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రతినెల టన్నుల చొప్పున బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, ఈ దందాను పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, సిరోంచ గ్రామం బ్లాక్ మార్కెట్ కు అడ్డగా మారింది సుమారు 50 మంది కూలీలతో, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కూడా, రవాణా జోరుగా జరుగుతుందని ప్రజలలో వినిపిస్తోంది. బియ్యం పక్కదారి పట్టకుండా ఎన్ని సంస్కరణలు తెచ్చిన, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన ఫలితం లేకుండా పోతుంది. ఇలాంటి అక్ర మాలకు పాల్పడేవారికి రేషన్ డీలర్ల మద్దతు కూడా ఉన్నటుగా ప్రజలు ఆరోపిస్తున్నారు.

**సరిహద్దులు దాటిస్తున్నారు ఈ మాదిరిగా ..!**

ఉదయాన్నే లేచి కిలోలచొప్పున సేకరిం చి, క్వింటాళ్లుగా పోగుచేసి మహారాష్ట్ర లోని సిరోంచ గ్రామానికి తరలిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యాపారి తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా, అతను తీవ్ర అనారోగ్యం తో మంచానికే పరిమితమై ఉంటాడు, కానీ చేసేది మాత్రం బడా బ్లాక్ మార్కెట్ దందా...! అధికారులు ఎన్ని కేసులు నమోదు చేసి నా..! అన్ని ప్రభుత్వ శాఖలకు అతను సుపరిచుతుడు. అందుకే అతని ఆగడాలను నిలువరించ లేకపోతున్నారు.

**గతం కంటే ఎక్కువ ధరతో బియ్యం సేకరణ**

తెలంగాణలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉత్తమ్ కుమార్ రెడ్డి పేద ప్రజలు కూడా సన్న బియ్యాన్ని వండుకొని తృప్తిగా కడుపునింపుకోవాలనే ఆశయంతో సంక్రాంత వేల సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించారు . ఇచ్చిన మాట ప్రకారం సన్న బియ్యం పంపిణీ జరుగుతుది. కానీ సన్నబియ్యం పంపిణి జరుగుతున్నా జీరో దందాలకు అడ్డుకట్ట పడకపోవడం శోచనీయం .బహిరంగగానే రేషన్ బియ్యం అమ్మకాలు చేస్తున్నా, చూసి చూడనట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు ,ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యన్ని వినియోగదారులనుంచి వారి, వేలు ముద్రలు బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకొని గతంలో కంటే ఎక్కువ ధరతో కిలో కి 25 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నారు రేషన్ డీలర్లు. బహిరంగంగానే ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్న, అధికారులు పట్టించుకోవడం లేదంటే వారి పూర్తి మద్దతు ఉన్నట్లు తెలుస్తుంది. ఇలాంటి రేషన్ డీలర్ల పై ఉన్నత అధికారులు ఉక్కుపాదం మోపాలి.

**అధికార యంత్రాంగం కూడా సై అంటున్న ఆరోపణలు**

రేషన్ దందాను నిలువరించే ప్రభుత్వ శాఖల్లో కొందరు కిందిస్థాయి ఉద్యో గులు అధికారులకు తప్పుడు సమాచా రం ఇస్తూ బ్లాక్ మార్కెట్ నడిపిస్తున్న తెలంగాణ వ్యాపారికి అండగా నిలుస్తు న్నారని, ఆరోపణలు ఉన్నాయి. సుమా రుగా 70 మంది కూలీలతో సిండికేట్ నడిపిస్తున్న వారిపై అధికారుల చూపే కరువైంది. నేరుగా రేషన్ షాప్ యజమాలతో ఆ వ్యాపారి ప్రత్యక్ష సంబం ధాలు ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి. గత పాలనలో కూడా అధికార యంత్రాంగం గట్టి చర్యలు తీసుకోలేక పోయింది. ప్రస్తుత ప్రభుత్వమైన దీనిపై నిఘా పెంచి ఇలాంటి సిండికేట్ దందాలను నిలిపి వెయ్యాలి....

## ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో చిన్నారి మృతి

**గండిపేట, మహా:** దీపావళి పండుగ సందర్భంగా టపాసుల కాల్చడానికి టపాసుల షాపు వద్ద టపాసులు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వస్తుండగా కారు ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలు అవ్వటంతో చిన్నారి కారు కింద పడి మృతి చెందిన సంఘటన గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటి అల్కాపూర్ లో జరిగింది. నార్సింగి సిఐ హరికృష్ణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్ లోని చెరుకురూ మండలం గొర్లపాడు కి చెందిన రవికుమార్(33) తండ్రి కిషోర్ బాబు, ఉద్యోగ నిమిత్తం మణికొండ మున్సిపాలిటీ లోని అల్కాపూర్ లో నివాసం ఉంటున్నారు. కాగా దీపావళి సందర్భంగా మతాబుల కోసం TS 07 GZ 3942 పై భార్య అనూష*29),కూతురు ఆవిష్క(5), కొడుకు కుషాన్ జోయల్ (2),కాజాగూడ వద్దకు వెళ్లి టపాసులు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో అల్కాపురి వద్ద టాటా నెక్సన్ కారు TS 09 AE TR 2860 చంద్ర మౌలేశ్వర్ రావు (32),వృత్తి సాఫ్టవేర్ ఇంజనీర్ మితిమీరిన వేగంతో వెనుక నుండి బలంగా ఢీకొట్టడం తో క్రింద పడ్డ కుటుంబ సభ్యులకు తీవ్రగాయాలు అవ్వగా చిన్నారి కుషాన్ జోయల్ పై నుండి కారు వెళ్ళటంతో తీవ్ర రక్త స్రావం అవ్వటం తో హుటాహుటిన స్టార్ ఆసుపత్రి కి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు, దీనితో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలు చిరస్మరణీయం

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ మహా;** శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 191మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ తో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద , స్నేహ శబరిష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ఎన్.డి.పి సి.ఎల్ సి యం డి వరుణ్ రెడ్డి, ఎన్ సి సి గ్రూప్ కమాండర్ కర్నల్ సచిన్ అన్నారావు, కర్నల్ రవి, డిసిపి అంకిత్ కుమార్, అదనపు డిసిపిలు సురేష్ కుమార్, ప్రభాకర్ రావు శ్రీనివాస్, బాలస్వామి, రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈ వి శ్రీనివాస్ రావుతో పాటు ఏసిపిలు, ఇన్స్ స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్. ఐలు పోలీస్ . అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పాగుచ్చాలు వుంచి నివాళులు అర్పించిన అనంతరం , ఆర్.ఐ స్పర్జన్ సారధ్యంలో సాయుధ పోలీసులు 'శోక్ శస్త్ర చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను ఆర్పించిన పోలీసులు మహనుభావులని, పోలీసు అమరవీరుల చూపిన మార్గదర్శకాన్ని అనుసరిస్తూ, ప్రజల శ్రేయస్సు కోరకు పాటుపడాలని, ప్రజల్లో మంచి పేరు రావాలంటే చిత్తశుద్ధి, నీతి, నిజాయితీతో పని చేయాల్సి ఉంటుందని పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే వుంటారని, వారు మన మధ్య లేనకున్నా మనం వారిని స్మరిస్తునే వుంటామని, అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను కాపాడుకోవల్సిన భాధ్యత మనందరిపై వుందని, వారికి ఎలాంటి సమస్య వున్న వారికి పోలీస్ విభాగం తరుపున పూర్తి సహకారం అందజేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుండి మిషన్ హస్పటల్ వరకు నిర్వహించిన ర్యాలీలో శాసన సభ్యులు, పోలీసులు, అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు పోలీసు జాగృతి కళాబృందం సభ్యులు పాల్గోని పోలీసు అమరవీరులకు జోహర్లు అర్పించారు .

## శ్రీ ధనమైసమ్మ ఆలయంలో వైభవంగా లక్ష్మీ పూజ

### ఆలయ అధ్యక్షులు తోట బాబన్న



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం శ్రీ శివసాయినగర్ కాలనీ లోని శ్రీ మెట్లబావి ధనమైసమ్మ దేవాలయంలో దీపావళి సందర్భంగా శ్రీ లక్ష్మీ దేవి కి ప్రత్యేక నైవేద్యాలతో పూజలు వైభవంగా నిర్వహించామని ఆలయ అధ్యక్షులు తోట బాబన్న తెలిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా శ్రీ లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించడం జరిగిందని తోట బాబన్న తెలిపారు. దీపావళి సందర్భంగా లక్ష్మీ పూజలో పెద్ద ఎత్తున మహిళలు, దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారని దేవాలయ అధ్యక్షులు తోట బాబన్న , కమిటీ సభ్యులు తెలిపారు.

## జ్యోతిరావు పూలే విగ్రహం కూల్చడం హేయమైన చర్య

### మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్




**వరంగల్ మహా;** వరంగల్ నగరం 40వ డివిజన్ లోని ఉర్సుగుట్ట వద్ద జ్యోతిరావు పూలే విగ్రహాన్ని కూల్చివేసిన సంఘటనను నిరసిస్తూ గ్రేటర్ వరంగల్ నగర తొలి మేయర్, తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ స్థానిక బీసీ నాయకులతో కలిసి విగ్రహ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మీడియాతో మాట్లాడుతూ ఒకవైపు బీసిల ఆత్మగౌరవం కోసం రాజ్యాధికారంలో చట్టబద్ధంగా తమకు దక్కాల్సిన వాటా కోసం ఉద్యమం కొనసాగుతుంటే మరొకవైపు దుండగులు మహానీయుడు జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం దురదృష్టకరమని, దుండగులు తాగి మత్తులో చేసినట్లా లేదా ఇతర కారణాలతో చేసినట్లా మొత్తానికి బిసిలను అణగదొక్కే ప్రక్రియ బిసిలు ఆనవాళ్లు లేకుండా చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నారని ఏది ఏమైనప్పటికీ ఇలాంటి దుశ్చర్యలు చేసిన వారి పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇక్కడ జ్యోతిరావు పూలే విగ్రహం 2017 లో భరత్ అండ్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసారని వారికి నేడు హామీ ఇస్తున్న జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు కావాల్సిన ఖర్చు మొత్తం నా సొంత నిధులతో విగ్రహం ఏర్పాటు చేయిస్తానని నరేందర్ కమిటీ వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ 32, 33, 39, 40, 41 డివిజన్ల అధ్యక్షులు, ఇన్చార్జిల తో పాటు బిసి సంఘ ముఖ్య నాయకులు బిఆర్ ఎస్ పార్టీ యువజన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## టిజీ రైజింగ్ -2047 సిటిజన్ సర్వేలో అందరూ భాగస్వాములు కావాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వే లో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడొక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వేలో వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారని అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ 2047" సిటిజన్ సర్వేను చేపట్టిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈ నెల 25 వ తేదీ తో ముగుస్తుందని, ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in / telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి జిల్లా ప్రజలు తమ అమూల్యమైన సలహాలు , సూచనలను అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ కోరారు.

## గ్రీనరీ పనులను త్వరగా పూర్తి చేయండి

### కుడా వైస్ చైర్మన్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ మహా;** గ్రీనరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కుడా వైస్ చైర్మన్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం కాకతీయ మ్యూజికల్ గార్డెన్ (కే ఎం జీ)లో కొనసాగుతున్న పనులను వైస్ చైర్మన్ క్షేత్ర స్థాయి లో వాటి పురోగతిని పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కుడా వైస్ చైర్మెన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు దాదాపు గా పూర్తి అయిన దృష్ట్యా మిగిలిన ప్యాచ్ వర్క్ పనుల పూర్తి పై దృష్టి సారించి గ్రీనరీ పనులను పూర్తి చేసి త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుడా హార్టికల్టర్ అధికారి ఆసిఫ్ తో పాటు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సాస్కి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

### నగర మేయర్ గుండు సుధారాణి



**వరంగల్ మహా;** సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్ ) పథకం అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలసి పాల్గొని సాస్కి ప్రతిపాదనల రూపకల్పనల పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ సాస్కి ప్రతిపాదనలను 30 నవంబర్ 2025 లోగా అధికారులు పథకానికి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రం గా అవగాహన చేసుకొని వ్యూహాత్మక ప్రణాళికతో స్థలాలను గుర్తించి, తగిన డాక్యుమెంటేషన్‌తో అన్ని అంశాలను క్రోడీకరించి ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. సాస్కి పథకం లో భాగం గా చారిత్రాత్మక నేపధ్యం కలిగిన నగరం లో పురాతత్వ విధానాలను ప్రోత్సహించి అభివృద్ధి చేయాలని, నైబర్ హుడ్ ప్రణాళిక అంశంలో పాదచారులు నడిచే మార్గాలను అభివృద్ధి చేయడం, మౌలిక వసతులను కల్పించడం, ప్రజలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టడం తో పాటు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పార్కుల అభివృద్ధి, ఓపెన్ స్పేస్ లను అభివృద్ధి చేయడం స్పాంజ్ సిటీ కాన్సెప్ట్ లో భాగం గా నగరం లో స్పాంజ్ పార్క్ ఏర్పాటు చేయడం, అందుకు అనువైన స్థలాన్ని గుర్తించడం, సిటీ గ్రీన్ కార్యక్రమం లో భాగం గా నగరం లో 50 ఎకరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం తో పాటు నగరం లోగల చారిత్రాత్మక (పురాతన) బావులను పునరుద్ధరించే అంశాలను పొందుపరచాలని ఈ సందర్భం గా మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఈ సత్యనారాయణ, ఈ ఈ లు రవికుమార్, మాధవి లత, డి ఈ శివానంద్, స్మార్ట్ సిటీ పి ఎం సి ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలి...

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**వలిగొండ, మహా:** నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళ వారం నాడు వలిగొండ మండలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొలుగోలు కేంద్రాలు ఏదులగూడెం,మందాపూర్, నాతాళ్ల గూడెం, రెడ్ల రేపాక కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చిందని , ఎంత మేరకు కొనుగోలు చేయడం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని తేమ శాతాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులు ఎవరు కూడా దళారులను నమ్మి కష్టపడి పండించిన పంటని తక్కువ ధర కు అమ్ముకుని నష్టపోకూడదు అని అన్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని సౌకర్యాలు కలిపించిందని . ధాన్యం కి మద్దతు ధర కూడా కల్పించింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యం అమ్ముకోవాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి అని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులను ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎట్టిపరిస్థితుల్లో కూడా ఏ ఒక్క రైతు నష్ట పోకుండా దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయొద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులు తెచ్చిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు.

**తహసీల్దారు కార్యాలయం తనిఖీ**

వలిగొండ మండలంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. భూ సమస్యల సంబంధిత దరఖాస్తు లను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు.కుల ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు.

# రియల్టీలో బ్లాక్‌మనీ చక్కర్లు..



రియల్ ఎస్టేట్ రంగాన్ని భారత ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైనదిగా పరిగణిస్తున్నారు. అయినప్పటికీ ఈ రంగం దశాబ్దాలుగా నల్లధనం లేదా లెక్కల్లో చూపని ధనం ప్రవాహానికి ప్రధాన వేదికగా మారిందనే వాదనలున్నాయి. ఇక్కడ జరిగే కొనుగోళ్లు, అమ్మకాలు, పెట్టుబడుల్లో గణనీయమైన భాగం నగదు రూపంలోనే జరుగుతుండటం దీనికి ముఖ్య కారణం. డిజిటలైజేషన్ అని చెప్పుకుంటున్న, ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్లు వచ్చినా ఈ విభాగంలో ఇప్పటికీ చాలా వరకు నగదు రూపంలోనే లావాదేవీలు జరుగుతున్నాయనేది వాస్తవం. రియల్టీ రంగంలో నల్లధనం ఎలా ప్రవహిస్తుంది, అందుకు గల కారణాలు, దాని ప్రభావాలను విశ్లేషిద్దాం.

### నల్లధనం ప్రవాహం ఎలా జరుగుతుంది?

సాధారణంగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు రెండు రకాలుగా విభజిస్తారు. అధికారిక లావాదేవీలు.. ఇది బ్యాంక్ ద్వారా చెక్, ఆన్‌లైన్ బదిలీ (RTGS/NEFT) రూపంలో చెల్లిస్తారు. ఈ మొత్తం ప్రభుత్వ రికార్డులలో నమోదు చేయబడి, దీనిపై కొనుగోలుదారు, విక్రేత పన్నులు చెల్లిస్తారు. డాక్యుమెంట్లలో, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చూపించే ధర ఇదే.

### నగదు లావాదేవీ

ఇది అధికారిక పత్రాల్లో చూపకుండా కొనుగోలుదారు నేరుగా విక్రేతకు నగదు రూపంలో ఇచ్చే మొత్తం. ఈ లావాదేవీ వివరాలను ఆదాయపు పన్ను శాఖకు లేదా ప్రభుత్వానికి తెలియజేయరు. మార్కెట్ ధర, డాక్యుమెంట్ ధర మధ్య ఉన్న వ్యత్యాసం ఈ నల్లధనం.

### ప్రవాహ విధానం

కొనుగోలు దశ: ఒక కొనుగోలుదారు తాను దాచుకున్న నల్లధనాన్ని ఉపయోగించి ఒక ఆస్తిని కొనుగోలు చేయాలనుకున్నప్పుడు ఆస్తి యజమానికి డాక్యుమెంట్‌లో ఉన్న ధర కంటే ఎక్కువ మొత్తాన్ని (అదనపు నగదు) చెల్లిస్తారు. ఈ అదనపు మొత్తం కొనుగోలుదారు నల్లధనంగా ఉంటుంది. ఇదే తర్వాత కాలంలో ఆస్తి యజమానికి సైతం నల్లధనంగా మారుతుంది. అమ్మకం దశ: కొనుగోలుదారు ఆస్తిని అమ్మే సమయానికి ఆ ఆస్తి విలువ పెరిగి ఉంటుంది. అప్పుడు అతను కొత్త కొనుగోలుదారు నుంచి మార్కెట్ విలువ ప్రకారం ధరను తీసుకుంటాడు. ఇందులో కొంత భాగం అధికారికంగా లెక్క చూపినా పెరిగిన విలువలో ఎక్కువ భాగం నగదు రూపంలో (నల్లధనం) తీసుకునేందుకు మొగ్గు చూపుతాడు. ఆస్తి అమ్మే సమయానికి పన్ను ఎగవేత కోసం ఇది నల్లధనంగా మారుతుంది.

### నిర్మాణం/డెవలప్‌మెంట్

రియల్ ఎస్టేట్ డెవలపర్లు భూమి కొనుగోలు, నిర్మాణ సామగ్రి, కార్మికుల వేతనాలు వంటి వాటిలో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు నిర్వహిస్తారు. ఇది వారికి లెక్కల్లో చూపని ఆదాయం (నల్లధనం) సృష్టించడానికి అవకాశం ఇస్తుంది.

### అధిక స్టాంప్ డ్యూటీ, పన్నులు

ఆస్తుల రిజిస్ట్రేషన్, అమ్మకాలపై ప్రభుత్వాలు విధించే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, మూలధన లాభాల పన్ను చాలా ఎక్కువగా ఉండటం. ఈ అధిక పన్నులను తప్పించుకోవడానికి కొనుగోలుదారులు, విక్రేతలు ఇద్దరూ డాక్యుమెంట్లలో ఆస్తి విలువను తక్కువగా చూపించి మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో లావాదేవీ చేస్తారు.

### ధరల్లో వ్యత్యాసం

ప్రభుత్వం నిర్ణయించిన సర్కిల్ రేటు కంటే మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం. విక్రేత మార్కెట్ ధరను డిమాండ్ చేసినప్పుడు కొనుగోలుదారు స్టాంప్ డ్యూటీని ఆదా చేసుకోవడానికి సర్కిల్ రేటుకు మాత్రమే డాక్యుమెంట్ చేయించి మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో చెల్లిస్తాడు.

### దాచుకునే అవకాశం

నల్లధనం (లెక్కల్లో చూపని ఆదాయం) ఉన్న వ్యక్తులకు ఆ డబ్బును సులభంగా, సురక్షితంగా దాచుకోవడానికి రియల్ ఎస్టేట్ ఒక ఉత్తమ మార్గంగా కనిపిస్తుంది. నల్లధనాన్ని ఆస్తి రూపంలోకి మార్చడం ద్వారా వారు దానిపై వడ్డీ లేదా పన్ను చెల్లించకుండా తప్పించుకుంటారు. రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో పూర్తి పారదర్శకత లేకపోవడం. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) వంటి వ్యవస్థలు ఉన్నా పాత లేదా వ్యక్తిగత ఆస్తుల కొనుగోలు, అమ్మకాలలో నగదు ప్రవాహాన్ని నియంత్రించే యంత్రాంగం బలహీనంగా ఉందనే వాదనలున్నాయి. రియల్ ఎస్టేట్‌లో తరచుగా ధరలు వేగంగా పెరుగుతుంటాయి. ఈ లాభాలపై పన్నులు కట్టకుండా ఉండటానికి విక్రేతలు నగదు రూపంలో అమ్మకాలు జరపడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

### పరిణామాలు ఇలా..

రియల్ ఎస్టేట్‌లో నల్లధనం ప్రవాహం అనేక ఆర్థిక, సామాజిక సమస్యలకు దారితీస్తుంది. నల్లధనం వల్ల వాస్తవ మార్కెట్ ధర కృత్రిమంగా పెరుగుతుంది. మధ్యతరగతి, పేద ప్రజలకు ఇల్లు కొనుగోలు చేయడం కష్టమవుతుంది. పన్ను ఎగవేత కారణంగా ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, మూలధన లాభాల పన్ను రూపంలో రావాల్సిన ఆదాయం కోల్పోతుంది. నల్లధనం ప్రవాహం దేశ ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది. ఈ రంగంలోని అధికారులకు లంచాలు ఇచ్చి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం వంటి అవినీతి కార్యకలాపాలకు ఇది ఆజ్యం పోస్తుంది.

# ముహూరత్ ట్రేడింగ్: ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

దీపావళి సందర్భంగా దేశీయ స్టాక్ మార్కెట్లలో నిర్వహించిన ముహూరత్ ట్రేడింగ్ ఫ్లాట్‌గా ముగిసింది. భారత స్టాక్ మార్కెట్లు 'సంవత్ 2082'ను జాగ్రత్తగా ప్రారంభించాయి. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు స్వల్ప సానుకూలం వైపు స్థిరపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 62.97 పాయింట్లు లేదా 0.07 శాతం పెరిగి 84,426.34 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 25.45 పాయింట్లు లేదా 0.1 శాతం పెరిగి 25,868.60 స్థాయిల వద్ద స్థిరపడింది. విస్తృత మార్కెట్లలో ఎన్ఎస్ఈ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.11 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.52 శాతం పెరిగాయి. సెక్టోరల్ ఫ్రంట్ లో నిఫ్టీ బ్యాంక్, పిఎస్‌యూ బ్యాంక్, రియల్టీ ప్రతికూలంగా స్థిరపడ్డాయి. నిఫ్టీ ఆటో, ఎనర్జీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, మీడియా, మెటల్, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ లో బజాజ్ ఫిన్సర్వ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, పవర్ గ్రిడ్, బజాజ్ ఫైనాన్స్ టాప్ గెయినర్లుగా నిలిచాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి సుజుకి, ఏషియన్ పెయింట్స్ టాప్ లూజర్స్. ట్రేడింగ్ సెషన్ లో 2,213 స్టాక్స్ లాభాలతో ముగిశాయి. 710 తగ్గుముఖం పట్టాయి. ఎన్ఎస్ఈలో 116 షేర్లలో మార్పులేదు. 106 స్టాక్స్ కొత్త 52 వారాల గరిష్టాన్ని తాకగా, 36 షేర్లు 52 వారాల కనిష్ట స్థాయికి పడిపోయాయి. దీపావళి రోజున సాధారణ స్టాక్ మార్కెట్ కార్యకలాపాలకు సెలవు ఉంటుంది. కేవలం గంటపాటు ముహూరత్ ట్రేడింగ్ పేరుతో ప్రత్యేక ట్రేడింగ్ నిర్వహిస్తారు. దీన్ని సంప్రదాయంగా, ఒక శుభప్రదమైన కార్యక్రమంగా భావిస్తూ, నిర్వహిస్తూ వస్తున్నారు. ఇది కొత్త హిందూ క్యాలెండర్ సంవత్సరం విక్రమ్ సంవత్ 2082 ప్రారంభాన్ని సూచిస్తుంది.

# చైనాకు యూఎస్ వార్నింగ్.. భయమంతా అదే..



ప్రపంచ వాణిజ్య వేదికపై అమెరికా, చైనాల మధ్య టారిఫ్‌లు, వాణిజ్యపరమైన ఆంక్షల రూపంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అరుదైన అయస్కాంత లోహాల సరఫరాను అడ్డుకోవద్దని అమెరికా చైనాకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమెరికా విధించిన టారిఫ్‌లకు ప్రతిచర్యగా ఈ కీలక లోహాల ఎగుమతులను నియంత్రించాలని చైనా చూస్తోంది. ఈ అరుదైన లోహాల ఉత్పత్తి, శుద్ధి ప్రక్రియలో చైనా ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం చెలాయిస్తోంది. ప్రపంచంలోని అరుదైన ఖనిజాల తవ్వకంలో దాదాపు 70%, వాటి శుద్ధిలో 90% వరకు చైనా నియంత్రిస్తోంది. ఈ ఏకఛత్రాధిపత్యం కారణంగా ఈ లోహాలపై ఎగుమతి నియంత్రణలను విధిస్తే అమెరికాపై చైనా గణనీయమైన ప్రభావాన్ని చూపగలదు. ఈ నేపథ్యంలో చైనా తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి, టారిఫ్‌లను తగ్గించుకోవడానికి ఈ లోహాల నియంత్రణను ఒక 'ట్రంప్ కార్డ్'గా ఉపయోగించుకోవాలని చూస్తోంది. అరుదైన అయస్కాంత లోహాల్లో ముఖ్యంగా నియోడైమియం, ప్రెసోడైమియం, డిస్ప్రోసియం వంటి మిశ్రమాలతో తయారైన శాశ్వత అయస్కాంతాలు కీలకంగా ఉన్నాయి. ఇవి ఆధునిక సాంకేతికతకు, డిఫెన్స్ రంగానికి వెన్నెముకగా ఉన్నాయి. ఇవి చాలా చిన్నవిగా, తేలికగా ఉండి శక్తివంతమైన అయస్కాంత క్షేత్రాన్ని సృష్టిస్తాయి. వీటిని ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ఎలక్ట్రిక్ వాహనాల మోటార్లలో, పవన విద్యుత్ టర్బైన్‌ల జనరేటర్లలో కీలకం. ఇవి అధిక సామర్థ్యంతో శక్తి మార్పిడిని సాధ్యం చేస్తాయి. కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు, స్పీకర్లు, హెడ్‌ఫోన్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో ఇవి తప్పనిసరి. అధునాతన ఆయుధ వ్యవస్థలైన ఫైటర్ జెట్‌లు, క్షిపణులు, ఇతర స్మార్ట్ బాంబులు వంటి వాటిలో ఉపయోగించే మోటార్లు, సెన్సార్లకు ఈ అయస్కాంత లోహాలు ఎంతో అవసరం. ఈ కారణం వల్లనే ఈ లోహాలను వ్యూహాత్మకంగా ముఖ్యమైనవిగా పరిగణిస్తారు. ఎంఆర్ఐ యంత్రాలు (మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్), పేస్‌మేకర్లు, హియరింగ్ ఎక్విప్‌మెంట్లు వంటి వైద్య పరికరాల్లో వీటిని ఉపయోగిస్తారు. పవర్ టూల్స్, రోబోటిక్స్, హైపెర్ఫార్మెన్స్ ఏసీ సర్వో మోటార్లతో సహా అనేక పారిశ్రామిక అనువర్తనాలలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అరుదైన అయస్కాంత లోహాల వివాదం కేవలం వాణిజ్య పరమైన సమస్య కాకుండా ప్రపంచ భద్రత, సాంకేతిక ఆధిపత్యం, గ్రీన్ ఎనర్జీ భవిష్యత్తుకు సంబంధించిన అంశం. ఈ లోహాలపై చైనాకున్న పట్టు దాన్ని ఒక శక్తివంతమైన భౌగోళిక రాజకీయ ఆయుధంగా మారుస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా, ఇతర దేశాలు చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి తమ సొంత అరుదైన లోహాల సరఫరా గొలుసులను బలోపేతం చేసుకోవాలి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# మాజీ అధ్యక్షుడి జైలు జీవితం ప్రారంభం

**పారిస్:** అక్రమంగా భారీగా నిధులు స్వీకరించారనే ఆరోపణలకు సంబంధించి గత నెలలో జైలు శిక్ష ఖరారైన ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ జైలు జీవితం ప్రారంభమైంది. 2007 ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల సమయంలో లిబియాకు చెందిన గడాఫీ నేతృత్వంలోని ప్రభుత్వ నుండి సర్కోజీ అక్రమంగా భారీగా నిధులు స్వీకరించారనే ఆరోపణల దరిమిలా నమోదైన ఈ కేసులోని కొన్ని అభియోగాలనను కొట్టివేయగా, ఒకదానిలో నికొలస్ సర్కోజీని దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం ఆయనకు శిక్షను ఖరారు చేసింది. సర్కోజీకి జైలు శిక్షను తప్పనిసరిగా అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఆ సమయంలో జైలు శిక్ష తేదీ ఖరారు చేయని కోర్టు.. అటు తర్వాత ఆ తేదీని కూడా స్పష్టం చేయడంతో సర్కోజీకి తాజాగా జైలు జీవితం అనుభవించడానికి వెళ్లారు. పారిస్‌లోని లా సాంటే జైలులో సర్కోజీని ఉంచారు. నికొలస్ సర్కోజీ 2007 నుంచి 2012 వరకు ఫ్రాన్స్ అధ్యక్షునిగా పనిచేశారు. అయితే అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో గడాఫీ నేతృత్వంలోని లిబియా ప్రభుత్వం నుండి వచ్చిన ఆర్థిక సాయంపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నిధులను దౌత్య సహాయంగా చెప్పకుండా స్వీకరించారని, అవి తన ఎన్నికల ప్రచారానికి ఉపయోగించినట్లు పలువురు ఆరోపించారు. అవినీతి, ప్రచారానికి అక్రమ నిధుల వినియోగం, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం తదితర ఆరోపణలు రుజువు కానప్పటికీ.. నేరపూరిత కుట్రలో సర్కోజీని న్యాయస్థానం దోషిగా ప్రకటించి, ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.

# హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ భీకర దాడి





లెబనాన్‌లోని హిజ్బుల్లా ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా వైమానిక దాడులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఈ దాడుల్లో నబాతియే ప్రాంతంలోని కీలక ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడులపై ఐడీఎఫ్ ప్రతినిధి స్పందిస్తూ.. ఉత్తర కమాండ్ నేతత్వంలో ఐడీఎఫ్.. లెబనాన్‌లోని నబతియే ప్రాంతంలో హిజ్బుల్లా ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించిందని తెలిపారు. హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ లెబనాన్ అంతటా ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి ప్రయత్నాలను కొనసాగిస్తోందని.. హిజ్బుల్లా కార్యకలాపాలు.. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నాయని ఐడీఎఫ్ పేర్కొంది.

# దిగిరాకపోతే 155% సుంకాలు: ట్రంప్



ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ యుద్ధం కొనసాగుతోంది. రష్యా చమురును కొనడం ఆపకపోతే భారీ సుంకాలు చెల్లించాల్సి వస్తుందని ఇండియాకు ఆయన హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. తాజాగా చైనాపైనా ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చైనాకు అమెరికాపై అపార గౌరవం ఉందని.. అందుకే ఎక్కువ టారిఫ్‌లు చెల్లిస్తోందని వెటకారంగా మాట్లాడారాయన. ఈ క్రమంలో.. భారీ సుంకాల మోత తప్పదంటూ హెచ్చరికల జారీ చేశారు. తాజాగా అమెరికా ఆస్ట్రేలియాతో 8.5 బిలియన్ డాలర్ల 'అరుదైన ఖనిజాల' ఒప్పందం చేసుకుంది. సోమవారం ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ వైట్‌హౌజ్‌లో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఇద్దరూ మీడియాతో మాట్లాడుతున్న టైంలో.. ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాఅమెరికా ఈ ఇరు దేశాలు అద్భుతమైన ఒప్పందం కుదుర్చుకోవాల్సిందేనని, అలా జరగని పక్షంలో చైనా 155 శాతం సుంకాలు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. చైనాతో అద్భుతమైన వాణిజ్య ఒప్పందం కుదరనుందని భావిస్తున్నా. ఈ ఒప్పందం రెండు దేశాలకు మాత్రమే కాకుండా ప్రపంచానికి కూడా మంచిదై ఉంటుంది. చైనా అమెరికా పట్ల చాలా గౌరవంగా వ్యవహరిస్తోందని.. ప్రస్తుతం 55% టారిఫ్‌ల రూపంలో భారీగా డబ్బు చెల్లిస్తోందని పేర్కొన్నారు. నవంబర్ 1న ఒప్పందం కుదరకపోతే టారిఫ్‌లు 155%కి పెరిగే అవకాశం ఉంది అని హెచ్చరించారు. అక్టోబర్ 31వ తేదీ నుంచి దక్షిణ కొరియా వేదికగా ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార (APEC) సమావేశం జరగనుంది. అయితే.. దీనికంటే ముందే అక్టోబర్ 29, 30 తేదీలలో ట్రంప్ అక్కడ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ కానున్నారు. తనకు చైనా అధ్యక్షుడికి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయనన ట్రంప్.. ఇరు దేశాలకు లాభదాయకంగా ఉండే ఒప్పందం కుదిరే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. చైనా ప్రపంచంలో అరుదైన ఖనిజాల ప్రధాన సరఫరాదారు. వీటి సాయంతోనే స్మార్ట్‌ఫోన్లు, యుద్ధ విమానాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర ఆధునిక సాంకేతిక పరికరాల తయారు అవుతుంటాయి. అయితే.. చైనా ఈ ఎగుమతులపై నియంత్రణలు పెంచింది. దీంతో అమెరికా సహా ఇతర దేశాలకు ఈ ఖనిజాలు అందుబాటులో ఉండటం కష్టతరమయ్యే చాన్స్ ఉంది. అందుకే ట్రంప్ చైనాతో మంచి వాణిజ్య ఒప్పందం కుదిరితే, ఇలాంటి సమస్యలు తగ్గుతాయని ఆశిస్తున్నారు.



# పాకిస్థాన్‌లో కేజీ టమాటా రూ.700

నిత్యావసర కూరగాయల్లో ముఖ్యమైన టమాటా ధర పాకిస్థాన్‌లో సామాన్యుడికి అందనంత దూరంలో ఉంది. అక్కడ కిలో టమాటా ధర రూ.700 పలుకుతుందంటే ఆ దేశంలో ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. గత కొద్ది నెలలుగా పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులన్నీ కలిసి టమాటా ధరలను ఆకాశానికి చేర్చాయి. టమాటా ధరల పెరుగుదలకు ప్రధానంగా ఈ క్రింది కారణాలు దోహదపడుతున్నాయి.

### ప్రకృతి వైపరీత్యాలు

పాకిస్థాన్‌లో చుట్టూ ఉన్న సింధ్, బలూచిస్థాన్, దక్షిణ పంజాబ్ ప్రాంతాల్లో గతంలో సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా వేలాది ఎకరాల్లో టమాటా పంట నాశనమైంది. దీని ఫలితంగా దేశీయ మార్కెట్లోకి టమాటా సరఫరా గణనీయంగా తగ్గిపోయింది. వరదలు, వాతావరణ మార్పుల వల్ల రహదారులు దెబ్బతినడం, రవాణా ఆలస్యం కావడం వంటి కారణాల వల్ల కూడా పంట ఉన్న ప్రాంతాల నుంచి మార్కెట్లకు సరుకు చేరడంలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

### ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం

పాకిస్థాన్ రూపాయి విలువ (భారత రూపాయితో పోలిస్తే పాక్ రూపాయి విలువ 0.31 పైసలుగా ఉంది) ఇతర కరెన్సీలతో పోలిస్తే భారీగా పడిపోతోంది. దీనివల్ల దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దేశీయంగా పంట నష్టం జరగడంతో టమాటా కొరతను తీర్చడానికి పాకిస్థాన్ ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ వంటి దేశాల దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుంది. అయితే పాక్ రూపాయి విలువ తగ్గడం, సరిహద్దుల్లో అనిశ్చితులు పెరగడం వల్ల దిగుమతి చేసుకునే టమాటా ధరలు అధికమయ్యాయి. గతంలో టమాటాకు సరైన ధరలు లభించకపోవడం, వాతావరణ మార్పుల వల్ల తరచుగా పంట నష్టాలు వాటిల్లడం వంటి కారణాల వల్ల రైతులు పంట సాగును తగ్గించారు.

### సీజనల్ కొరత

టమాటా ధరలు సీజన్‌ను బట్టి తరచుగా మారుతుంటాయి. ముఖ్యంగా రెండు ప్రధాన పంటల సీజన్‌ల మధ్య కొద్దిపాటి కొరత ఏర్పడటం సర్వసాధారణం. అయితే ప్రస్తుత ఆర్థిక, వాతావరణ పరిస్థితులు ఈ సాధారణ కొరతను మరింత తీవ్రతరం చేశాయి. సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కొంతమంది వ్యాపారులు పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా తీసుకుని కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | బుధవారం, హైదరాబాద్ | 22-10-2025
ANN తెలుగు



# పండట పూట బాలీవుడ్‌లో విషాదం.. ప్రముఖ నటుడు మృతి

దీపావళి పండగ పూట బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని (84) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. అస్త్రాని మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. గోవర్ధన్ అస్రాని 1941లో జైపుర్‌లోని ఓ మిడిల్ క్లాస్ ఫ్యామిలీలో జన్మించారు. తండ్రి కార్పెట్ షాప్ రన్ చేసేవాడు. ఫ్యామిలీ బిజినెస్‌పై అస్రానికి ఆసక్తి ఉండేది కాదు. చదువుతున్న రోజుల్లోనే ఆల్ ఇండియా రేడియోలో వాయిస్ ఆర్టిస్ట్‌గా పని చేశాడు. దర్శకులు కిశోర్ సాహు, హృషికేశ్ ముఖర్జీ సలహా మేరకు పుణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో జాయిన్ అయ్యారు. 'హమ్ కహా జా రహే హై'(1966) చిత్రంతో వెండితెర ఎంట్రీ ఇచ్చాడు. 'షోలే'లోని జైలర్ పాత్ర ఆయనకు మంచి గుర్తింపుని తెచ్చిపెట్టింది. గోవర్ధన్ అస్రాని 50 ఏళ్ల సినీ జీవితంలో 350కి పైగా చిత్రాల్లో నటించారు. కమెడియన్‌గా, సపోర్టింగ్ యాక్టర్‌గా బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుని సంపాదించుకున్నాడు.



# మెగాస్టార్ ఇంట దీపావళి వేడుక..

మెగాస్టార్ చిరంజీవి ఈ దీపావళిని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ ఏడాది హైదరాబాద్‌లోని తన నివాసంలో టాలీవుడ్ ప్రముఖులతో జరుపుకున్నారు. ఈ వేడుకల్లో విక్టరీ వెంకటేశ్, అక్కినేని నాగార్జున, నయనతార సైతం పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను చిరంజీవి ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా అభిమానులతో పాటు అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. మెగాస్టార్ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న తొలి చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే మనశివశంకర వరప్రసాద్‌గారు మూవీ నుంచి సూపర్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. మీసాల పిల్లా అంటూ సాగే పాటను విడుదల చేయగా..యూట్యూబ్‌లో దూసుకెళ్తోంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వచ్చే ఏడాది సంక్రాంతికి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది.



# ఆ సమయంలో ప్రెగ్నెంట్ అని అబద్ధం చెప్పాను: రెజీనా

నటి రెజీనా తెలుగులోనే కాదు తమిళ్, మలయాళం, కన్నడం, హిందీ తదితర భాషల్లోనూ నటించి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. పలు చిత్రాల్లో ఐటమ్స్ సాంగ్స్‌తో కూడా మెప్పించిన ఆమెకు అనుకున్నంత రేంజ్ విజయాలు దక్కకపోయినప్పటికీ ఫ్యాన్స్ మాత్రం భారీగానే ఉన్నారు. తాజాగా ఆమె ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఒక సందర్భంలో తాను ప్రెగ్నెంట్ అని అబద్ధం చెప్పాల్సిన అవసరం ఎందుకొచ్చిందో సరదాగా పంచుకుంది. సుమారు పదేళ్ల క్రితం ఒకసారి బెంగళూరులో అర్ధరాత్రి 12 గంటల ప్రాంతలో స్నేహితురాళ్లతో కలిసి వెళుతుండగా తనకు లస్సీ తాగాలనిపించిందని గుర్తు చేసుకున్నారు. అప్పుడే మూస్తున్న ఒక షాప్ వద్దకు వెళ్లి లస్సీ కావాలని అడిగానన్నారు. అందుకు ఆ షాప్ యజమాని చిరాకుగా లస్సీ లేదు ఏమీలేదు వెళ్లు అని అన్నాడని తెలిపారు. వెంటనే తాను గర్భంతో ఉన్నాను. నాకు లస్సీ ఇస్తే ఆ భగవంతుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు అని అన్నానన్నారు. దీంతో తన స్నేహితురాళ్లు షాక్‌కు గురయ్యారన్నారు. అయితే, ఆ షాప్ అతను ఎక్కడ రెజీనా గర్భవతి అని అందరికీ చెబుతారో అని తన ఫ్రెండ్స్ కూడా భయపడ్డారన్నారు. అదృష్టవశాతు అతను ఎవరికీ చెప్పలేదని తెలిపారు. ఇలాంటి తమాషాలు చాలా చేశానని, ఇప్పటికీ చేస్తుంటానని రెజీనా అన్నారు. అయితే, కొంత కాలం తర్వాత మీడియాలో మాత్రం ఇదే విషయంపై మరో విధంగా ప్రచారం జరిగిందని గుర్తుచేసుకున్నారు.

# నా చిరునవ్వే అమ్మకు వెలుగు: వైష్ణవీ చైతన్య



- మా ఇంట్లో వారం రోజుల ముందే పండగ సందడి మొదలైపోయింది. హాల్‌లో ఎలాంటి దీపాలు పెట్టాలి... బాల్కనీని ఎలా అలంకరించాలని నేను, మా అమ్మ రకరకాల ప్లాన్స్ చేసుకున్నాం. మార్కెట్‌కి వెళ్లి స్వయంగా దీపాలు, పువ్వులు కొనడం నాకు చాలా ఇష్టం. కానీ ఈ సంవత్సరం కుదరలేదు. అయితే మా అమ్మ వెళ్లి, అన్నీ తీసుకొచ్చింది కాబట్టి హ్యాపీ. దీపావళి రోజు బంధువులకు, స్నేహితులకు ఇవ్వడానికి గిఫ్ట్స్ రెడీ చేయడం కూడా వారం రోజులు ముందే మొదలుపెట్టాం.
- మేం లక్ష్మీదేవి పూజ బాగా చేసుకుంటాం. పొద్దున్నుంచీ సాయంత్రం వరకూ చాలా హడావిడిగా ఉంటుంది. మాది లేట్ నైట్ పూజ. రాత్రి దాదాపు పదకొండు గంటలకు పూజ పూర్తవుతుంది. ఆ తర్వాత ఇంటి బయటికొచ్చి, దీపావళి సెలబ్రేట్ చేస్తాం.
- మా ఇంట్లో ఒక పెట్ ఉంది. ప్రతి దీపావళిని మేం గ్రాండ్‌గా జరుపుకుంటున్నా మరోవైపు మనసులో మా పెట్ గురించి ఆలోచించుకుని, కొంచెం ఫీల్ అవుతాం. ఎందుకంటే వాడికి (పెట్‌ని ఉద్దేశించి) క్రాకర్స్ స్మెల్ పడదు... పైగా సౌండ్స్ అంటే భయం. పండగ టైమ్‌లో సిక్ అయిపోతాడు. అందుకే మేం సింపుల్ క్రాకర్స్ కాలుస్తాం. పైగా పర్యావరణం కలుషితం కాకూడదనే ఫీల్ కూడా ఉండటంతో 'ఎకో ఫ్రెండ్లీ' దీపావళిని ప్రిఫర్ చేస్తాం.
- దీపావళి అవుట్‌ఫిట్ అంటే... చీర లేదా చుడీదార్. అయితే ఎక్కువగా చీర కట్టుకుంటాను. డెకరేషన్ చేస్తున్నప్పటి నుంచి పూజ వరకూ దాదాపు చీరలోనే ఉంటాను. క్రాకర్స్ కాలుస్తున్నప్పుడు చీర అంత సౌకర్యంగా ఉండదు కాబట్టి షరారా లేకపోతే చుడీదార్ వేసుకుంటాను.
- నా జీవితంలో వెలుగు తెచ్చిన వ్యక్తి అంటే మా 'అమ్మ'. నా బలం, స్ఫూర్తి, శక్తి అన్నీ తననుంచే నాకు వచ్చాయి. ఇంకా నా మొత్తం ఫ్యామిలీ. అమ్మా, నాన్న, బ్రదర్స్, ఇంకా నా చిన్ని పెట్... నా జీవితానికి వీళ్లంతా చాలా ముఖ్యం. నా ముఖంలో కనిపించే చిరునవ్వే వారికి వెలుగు. అయితే నీ జీవితానికి వెలుగు ఎవరు అంటే... మా 'అమ్మ'ని చెబుతాను. ఇవాళ నేను ఇంత మోటివేటెడ్‌గా ఉన్నానంటే తనే కారణం.
- నా లైఫ్‌లో ఇప్పటివరకూ బిగ్గెస్ట్ దీపావళి అంటే ప్రత్యేకంగా ఒకటని చెప్పలేను. అన్ని పండగల్లోకల్లా మా ఫ్యామిలీకి దీపావళి చాలా ముఖ్యం. ఆ రోజు 'నోము' అని ఒక పూజ చేస్తుంటాం. సత్యనారాయణ వ్రతం కూడా చేస్తాం. మా అమ్మా నాన్న ఉపవాసం ఉంటారు. ఇయర్‌లో ఇదే పెద్ద ఫెస్టివల్ అన్నట్లుగా జరుపుకుంటాం. బంధువులను కూడా పూజకు పిలుస్తాం. అందుకే దీపావళి మా కుటుంబానికి ఓ అందమైన పండగ.
- ఊహ తెలిశాక దీపావళి పండగను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. నేను, అమ్మ మార్కెట్‌కి బోలెడన్ని పువ్వులు, ఇంకా డెకరేషన్‌కి కావల్సినవి చాలా కొనేవాళ్లం. ఇన్నిన్ని ఎందుకు కొంటారు? అని డాడీ సరదాగా అంటుంటారు. మూడు రోజుల పాటు డెకరేషన్ అలానే ఉంచుతాం. దీపావళి రోజు సాయంత్రం చేసే పూజ కోసం పొద్దున్నుంచే పనులు మొదలుపెట్టేస్తాం. చివరికి అలసిపోతుంటాం
- ఇప్పటివరకూ మూవీ సెట్స్‌లో దీపావళి పండగ చేసుకోలేదు. అయితే ఆ అవకాశం రావాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే సెట్స్‌లో చాలామంది ఉంటారు. అందరితో సరదాగా మాట్లాడు కుంటూ, స్వీట్స్ షేర్ చేసుకుంటూ, ఫొటోలు దిగుతూ పండగ చేసుకుంటే ఆ హ్యాపీనెస్ వేరుగా ఉంటుంది.

## దీపావళి ... తీపి గుర్తు

నాకు చిన్నప్పుడు దీపావళి అంటే ఫుల్ భయం. టపాసుల సౌండ్‌కి భయపడి దాక్కోవడమే.. సో... మా అమ్మా, నాన్న, బ్రదర్స్... ఇలా ఫ్యామిలీ మెంబర్స్ అందరూ దగ్గరుండి నాకు ధైర్యం చెప్పి, కాకర పువ్వొత్తులు వంటివి కాల్పించేవారు. దీపావళికి సంబంధించి నాకు అదో తీపి గుర్తు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com